తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
సంపుటి : 01
సంచిక : 05
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సోమవారం, 17-07-2023

విలేకర్లు కావలెను
జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

**గాంధీభవన్ లో గాడ్సే రేవంత్ రెడ్డిపై మంత్రి కేటీఆర్ విమర్శించారు. రేపటి నుంచి రైతు వేదికల్లో కాంగ్రెస్ పార్టీ కటిక చీకట్ల పాలన వద్దు అని తీర్మానాలు చేస్తామని ప్రకటించారు.**

## ఎమ్మెల్యేలను కొనడంలో సిద్ధహస్తుడు -మంత్రి కేటీఆర్

# రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్



**జయభేరి, హైదరాబాద్ :**

ఉచిత విద్యుత్ విషయంలో కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కరెంట్ విషయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై... కాంగ్రెస్ సీనియర్లు స్పందించకపోవడం శోచనీయమన్నారు. రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, రైతులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నివాసంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్... రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. ఐదు దశాబ్దాలుగా తెలంగాణ రైతాంగానికి సాగునీరు, ఎరువులు ఇవ్వకుండా, ప్రాజెక్టులు నిర్మించకుండా కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు మేలు జరుగుతుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. రేపటి నుంచి రైతు వేదికల్లో 'కాంగ్రెస్ పార్టీ కటిక చీకట్ల పాలన వద్దు' అని తీర్మానం చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఇప్పుడున్నది రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ కాదని, చంద్రబాబు కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంటు మీద మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్ కాబట్టి ఏనాడూ ప్రధాని మోదీని ప్రశ్నించలేదన్నారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా రాష్ట్రానికి రావాల్సిన నిధులు అడ్డుకుంటున్న ప్రధాని మోదీని రేవంత్ ఏనాడూ పల్లెత్తు మాట అన్న పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యేలను కొనడంలో

మిగతా 2 లో



# శిల్పం, వర్ణం, కృష్ణం కార్యక్రమం ఖర్చెంత

**జయభేరి, ములుగు :**

ములుగు జిల్లా రామప్ప దేవాలయంలో ఏప్రిల్ నెలలో శిల్పం, వర్ణం, కృష్ణం పేరుతో వారసత్వ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆ ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు మంజూరు చేశారు. ఏఏ కార్యక్రమాలకు, ఏఏ పనులకు ఎంత ఖర్చు చేశారు. వేడుకల నిర్వహణకు వచ్చిన సెలబ్రెటీలకు ఎంత పారితోషికం చెల్లించారు. ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. వాటికి సంబంధించిన నిధులు, ఖర్చుల సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలపాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ పౌండర్ రాజేంద్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి దరఖాస్తు చేయడం జరిగింది. తెలంగాణ సిఎస్ కార్యాలయం నుంచి సంబంధిత శాఖలకు దరఖాస్తు బదిలీ చేయగా ఇప్పటివరకు మాత్రం తెలంగాణ రాష్ట్ర వారసత్వ శాఖ స్పందించారు. రామప్పలో శిల్పం, వర్ణం, కృష్ణం కార్యక్రమాలకు ఈ శాఖ నుంచి విడుదల చేయలేదు. ఇట్టి ఉత్సవాలు తమ శాఖ పరిధిలో నిర్వహించబడలేదని సమాచారం ఇచ్చారు.

## పొంగులేటికి హైకమాండ్ ప్రాధాన్యత, ఆ నేతకు అలర్ట్ టైం!



2 లో

## కబ్జా చేశారంటూ మహిళా ఎన్ ఆర్ ఐ ఫిర్యాదు!

### బీఆర్ఎస్ ఎంపీ కేకే కుమారులపై కేసు నమోదు?



**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ ఎంపీ కేకే కుమారులపై ఓ మహిళా ఎన్ఆర్ఐ ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ లోని తన స్థలాన్ని ఆక్రమించారనే ఆరోపణలతో పోలీసులను ఆశ్రయించారు. ఫలితంగా ఎంపీ కె.కేశవరావు ఇద్దరు కుమారులపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల కిందటే ఈ వ్యవహారం జరిగినప్పటికీ... ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు చూస్తే... జి. జయమాల అనే మహిళా 35 ఏళ్లుగా అమెరికాలోని న్యూజెర్సీలో నివాసం ఉంటున్నారు. 1983 లో షేక్ పేట మండలం సర్వే నంబర్403లో 939 గజాల స్థలాన్ని పి.సుదర్శన్రెడ్డి అనే వ్యక్తితో కలిసి షేక్ అలీఖాన్ అహ్మద్ నుంచి కొనుగోలు చేశారు. పి.సుదర్శన్రెడ్డి అనే వ్యక్తి చనిపోయారు. ఇందులో సుదర్శన్‌రెడ్డి దక్షిణం భాగంవైపు ఉండగా.., జయమాల ఉత్తరం(469 గజాలు) వైపు భాగాలు తీసుకున్నారు. జయమాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావటంతో అసలు విషయం బయటికి వచ్చినట్లు తెలుస్తోంది. గతేడాది బంజారాహిల్స్ రోడ్ నంబరు 13లోని జయమాల నివసించిన ఇంటికి గతేడాది ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ అయ్యాయి. 201415 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.2,13,67,500లకు స్థలాన్ని విక్రయించారని పేర్కొన్నారు. పెట్టుబడి మీద వచ్చిన లాభానికి సంబంధించి చెల్లించాల్సిన పన్ను, పెనాల్టీ.. రూ.1,40,41,300 చెల్లించాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. ఆ నోటీసులు అందుకు ఆమె.... నగరానికి వచ్చారు. ఆమె కొన్న స్థలం ఎంపీ కేశవరావు కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లినట్లు తేలింది. ఫలితంగా ఆమె ఒక్కసారిగా షాక్ తిన్నారు. 2013లోనే కేశరరావు కుమారుడు విప్లవ్కుమార్ స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ ను అంటూ తన సోదరుడు వెంకటేశ్వరరావుకు కేవలం రూ.3 లక్షలకు అమ్మినట్లు తేలింది. సంబంధిత పత్రాలను జయమాల చూడగా అవి ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. అయితే పోలీసులను ఆశ్రయించినప్పటికీ... కేసు నమోదు కాకపోవటంతోనే తాజాగా అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుని ఆశ్రయించారని తెలుస్తోంది. కోర్టు ఆదేశాలతో విచారించిన పోలీసులు... పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. గత నెల 13వ తేదీ కేసు నమోదైనప్పటికీ.. విషయం బయటికిరాకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ కేసులో కేకే కుమారులైన విప్లవ్‌కుమార్ ఎ1, వెంకటేశ్వర్‌రావును ఏ2గా చేర్చినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసుల నుంచి అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.

## తెలంగాణలో 61శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు!

2 లో

## 'ఔట్ డేటెడ్' కామెంట్స్ చిచ్చు

### తాండూరు ముదురుతున్న వార్



**జయభేరి, తాండూరు:**

అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ బీఆర్ఎస్ లోని అంతర్గత కలహాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. అధినాయకత్వం సూచనలతో కాస్త వెనక్కి తగ్గినప్పటికీ... ఎన్నికలకు మరికొద్దిరోజులే టైం ఉండటంతో.... నేతలు టాప్ గేర్ వేసే పనిలో పడ్డారు. అటువైపు నుంచి సౌండ్ వస్తే చాలు... ఇటువైపు నుంచి వెనువెంటనే కౌంటర్ వదిలేస్తున్నారు. ఇటీవలనే స్టేషన్ ఘన్ పూర్ పంచాయితీ ప్రగతి భవన్ కు చేరిన సంగతి తెలిసిందే. కట్ చేస్తే... తాజాగా తాండూరు పంచాయితీ రాజుకుంది. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కొన్ని కామెంట్స్ చేయటంతో... మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవరెంటో త్వరలోనే తెలుస్తుందంటూ కొన్ని వీడియోలను కూడా ప్రదర్శించారు. ఇది కాస్త... వికారాబాద్ జిల్లా పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. తనను ఔట్ డేటెడ్ లీడర్ అంటూ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి. ఏకాంగా మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.... తాను ఔట్ డేటెడ్ లీడర్ కాదని.... పార్టీ మారినప్పుడే రోహిత్ రెడ్డి ఔట్ డేటెడ్ అయ్యాడంటూ కౌంటర్ ఇచ్చారు. అనుకోకుండా గెలిచి మొనగాడు అనుకుంటున్నాడని.... ఆయన గతంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి పుణ్యాన ఎమ్మెల్యే అయ్యాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. టికెట్ ఎవరికి వచ్చేది మూడు నెలల్లో తెలుస్తుందన్నారు. ఆయన మాటలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని... పార్టీ అనుమతితోనే ప్రెస్ మీట్ కూడా పెట్టినట్లు చెప్పటం కొసమెరపు. ఇక అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని... ఈ విషయంలో హామీ కూడా ఇచ్చారంటూ స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని పట్టించుకోనవసరం లేదని కొట్టిపారేశారు. రోహిత్ రెడ్డిపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేసిన కామెంట్స్ చూస్తే తెలిసిపోతుందన్నారు మహేందర్ రెడ్డి. రోహిత్ రెడ్డి ఔట్ డేటెడ్ లీడర్ అని తాను మాత్రం కాదన్నారు. 2018 ఎన్నికల్లో అనూహ్యంగా ఆయన గెలిచారని... ఎన్నికల టైంలో పార్టీ మారను అని స్పష్టంగా చెప్పిన రోహిత్ రెడ్డి... బీఆర్ఎస్ లో ఎలా చేరానని అడిగారు. ఇందుకు చేసిన వీడియోను కూడా మహేందర్ రెడ్డి మీడియాకు చూపించారు. కాంగ్రెస్ టికెట్ పై గెలిచిన పైలట్ రోహిత్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరిన నాటి నుంచి పట్నం మహేందర్ రెడ్డితో వర్గపోరు నడుస్తోంది. ఎవరికి వారుగా కార్యక్రమాలు చేసుకుంటున్నారు. చాలాసార్లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఎవరికి వస్తుందనేది మాత్రం ఆసక్తికరంగా మారిందనే చెప్పొచ్చు. ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో రోహిత్ రెడ్డి ఫిర్యాదుదారుడిగా ఉన్నారు. ఆయనకు ప్రభుత్వం కూడా వై కేటగిరి భద్రత కల్పించింది. ఈ నేపథ్యంలో---వచ్చేసారి కూడా ఆయనకే టికెట్ ఇచ్చి అండగా ఉంటుందా---? లేక ఇతక కారణాలరీత్యా పట్నంకే మరోసారి టికెట్ దక్కుతుందా అనేది చూడాలి---!

## పాతబస్తీకి మెట్రో పరుగులు, ఎంజీబీఎస్‌ఫలక్ నుమా మధ్య 5 స్టేషన్లు!



2 లో

jayabheridaily.com
ప్రభాత
జయభేరి



▶▶ మొదటిపేజీ తరువాయి

## రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్

రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడని విమర్శించారు. గాంధీభవన్‌లో గాడ్సే రేవంత్‌రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇటీవల ఓ ప్రభుత్వ పాఠశాలలో తన కుమారుడు హిమాన్షు మాట్లాడిన మాటల్లో తప్పులేదన్నారు. ప్రతి పాఠశాలని బీఆర్ఎస్ ప్రభుత్వమే బాగుచేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ పాలన చూసి మహారాష్ట్ర రైతులు కూడా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని సీఎం జగన్ ఆంధ్రాకు తీసుకెళ్లారని, చంద్రబాబు కనుసన్నల్లో తెలంగాణ కాంగ్రెస్ నడుస్తుందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎడ్లు తెలియదు, వడ్లు తెలియదని ఎద్దేవా చేశారు. రాహుల్ కు తెలిసిదల్లా... క్లబ్బులు, పబ్బులేనని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రూ.80 వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల స్కాం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కాంగ్రెస్ రైతు విధానాలకు వ్యతిరేకంగా రైతు వేదికల్లో తీర్మానాలు చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. 10 రోజుల పాటు రైతు వేదికల్లో తీర్మానాలు కొనసాగుతాయన్నారు. మూడు గంటలు నశించాలి, మూడు పంటలు వర్ధిల్లాలని కేటీఆర్ అన్నారు.




## వారం రోజుల పాటు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

**జయభేరి, హైదరాబాద్ :**

భాగ్యనగరంలోని నగరంలోని పలు రూట్లలో నడిచే ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ మేరకు ఆయా రూట్ల వివరాలతో పాటు తేదీలను వెల్లడించింది. ప్రయాణికులకు అలర్ట్ ఇచ్చింది దక్షిణ మధ్య రైల్వే. పలు రూట్లలో నడిచే ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జులై 17 నుంచి 23వ తేదీ వరకు వారం పాటు 22 ఎంఎంటీఎస్ రైళ్ల సర్వీస్‌లను రద్దు చేసినట్లు పేర్కొంది. నిర్వహణ పనుల కోసం రద్దు చేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఎంచుకోవాలని సూచించింది. లింగంపల్లిహైదరాబాద్(47129, 47132, 47133, 47135, 47136, 47137) ట్రైన్లతో పాటు హైదరాబాద్ లింగంపల్లి (4711447105, 47108,47109, 47110, 47112) రైళ్లను రద్దు చేశారు. ఉదానగర్‌లింగంపల్లి(47165), లింగంపల్లిఫలక్‌నుమా(47189), లింగంపల్లిఉదానగర్(47178,47181), లింగంపల్లిఫలక్‌నుమా(47179), ఫలక్‌నుమాలింగంపల్లి(47158) మధ్య నడిచే పలు ఎంఎంటీస్ ట్రైన్లు రద్దు అయ్యాయి. విజయవాడ రూట్‌లో వెళ్లే పలు రైళ్లను రద్దు చేసింది దక్షిణ మధ్య రైల్వే. జూలై 17 నుంచి జూలై 23 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. విజయవాడ పరిధిలో భద్రతకు సంబంధించిన మెయింటనెన్స్ పనుల కారణంగా రద్దు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపింది. ఇందులో కాజీపేట, విజయవాడ, నిజామాబాద్, నాందేడ్, ఖమ్మం మీదుగా నడిచే రైళ్లు ఉన్నాయి.

## ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపిడీవో

**జయభేరి, ఏలూరు :**

వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని పెదవేగి ఎం పి డి ఓ గంజి రాజ్ మనోజ్ అన్నారు. బాగా చదువుకుని పాఠశాలకు, వసతి గృహానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కూచింపూడి సాంఘీక సంక్షేమ ఎస్ సి బాలుర వసతి గృహాన్ని ఆకస్మికం గా పరిశీలించారు. కొద్దిసేపు వసతి గృహ విద్యార్థులకు ట్యూటర్ గా అవతారమెత్తారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, వారిలో దాగి ఉన్న నైపుణ్యత తెలుకునేందుకు, విద్యార్థుల ఆలోచనా విధానాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వె ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని పరిశీలించినట్టు ఎం పి డి ఓ రాజ్ మనోజ్ తెలిపారు. వసతి గృహం లో విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అందిస్తున్నారా అని వసతి గృహ వార్డెన్ ని అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం రాత్రి వసతి గృహం లో ఉన్న విద్యార్థుల తో కలిసి డిన్నర్ లో పాల్గొని వంటకాలను రుచి చూసారు. భోజనానంతరం విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో రోజువారీ విద్యార్థులకు అందించే అల్పాహారం పై ఆరా తీశారు. వసతి గృహం లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు.వారందరికీ సరిపడా టాయిలెట్స్.బాత్ రూమ్ లు సక్రమం గా ఉన్నాయా అని నేరుగా పరిశీలించారు. వసతి గృహం లో విద్యార్థులు పడుకోనే రూమ్ లను పరిశీలించారు.విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే దుప్పట్లు. రగ్గులు.జంఖానాలు.బుక్స్ భద్రపరచుకోవడానికి ట్రంక్ పెట్టెలు, కాస్మోటిక్స్ వంటివి సక్రమం గా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

# పొంగులేటికి హైకమాండ్ ప్రాధాన్యత, ఆ నేతకు అలర్ట్ టైం!

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణలో పార్టీ వ్యవహారాలపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. అధికారమే లక్ష్యంగా కీలక నేతలను రంగంలోకి దింపుతోంది. ఇటీవల పార్టీలో చేరిన పొంగులేటికి కీలక పదవి అప్పగించింది. తెలంగాణపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టిపెట్టింది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తుంది. దీంతో కీలక నేతలను ఘర్ వాపసీ కింద కాంగ్రెస్ లోకి ఆహ్వానిస్తుంది. ఇప్పటికే పొంగులేటి కాంగ్రెస్ చెంత చేరగా, జూపల్లి కృష్ణారావు అదేబాట పట్టారు. దీంతో గెలుపే ప్రామాణికంగా కాంగ్రెస్ హైకమాండ్ లెక్కలు వేస్తుంది. పొంగులేటికి అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. కీలకమైన ప్రచార కమిటీ కోఛైర్మన్ బాధ్యతలు అప్పగించింది. కేసీఆర్ లోటుపాట్లు తెలియటంతో పాటుగా ఆర్థికంగా కీలకమైన సామాజిక వర్గానికి చెందిన పొంగులేటికి వ్యూహాత్మకంగా ప్రాధాన్యత ఇచ్చింది. అదేవిధంగా ఉచిత కరెంట్ పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను అధిష్ఠానం సీరియస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధిష్ఠానం ఆరా తీస్తున్నట్లు సమాచారం. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలనేది కాంగ్రెస్ హైకమాండ్ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో పార్టీ వ్యవహారాలను హైకమాండ్ నేరుగా పర్యవేక్షిస్తుంది. వ్యూహాలను రచిస్తుంది. కీలక నేతలకు బాధ్యతలు ఇస్తుంది. పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలు, నేతల వ్యవహార శైలిపై నిఘా పెట్టింది. రానున్న అసెంబ్లీ ఎన్నికలకుగాను టీపీసీసీ ప్రచార కమిటీని కాంగ్రెస్ నాయకత్వం ఎంపిక చేసింది. ఈ కమిటీలో మాజీ ఎంపీ, ఖమ్మంలో కీలక నేత పొంగులేటి శ్రీనివాస



రెడ్డికి చోటుదక్కింది. కాంగ్రెస్ లో చేరిన తర్వాత స్పీడ్ పెంచిన పొంగులేటి.. ఖమ్మం జిల్లా నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా ఆయన పోటీచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లో పొంగులేటికి ఉన్న అనుభవం పార్టీకి కలిసి వస్తుందని కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ భావిస్తుంది. దిల్లీ స్థాయిలోనూ పొంగులేటికి వ్యాపార, రాజకీయ పరంగా ఉన్న సంబంధాలు కలిసి వస్తున్నాయని అంచనా వేస్తుంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించి తీరుతామని పొంగులేటి ధీమాగా చెబుతున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కు అదే నమ్మకం కలిగించారు. అన్ని రకాలుగా బలమైన నేతగా పొంగులేటిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తించింది. దీంతో పాటు రెడ్డి సామాజిక వర్గంలో పట్టు ఉండటంతో పాటుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ వ్యూహాలు పూర్తిగా తెలిసిన వ్యక్తిగా హైకమాండ్ పొంగులేటిని గుర్తించింది. కేసీఆర్ పై తిరుగుబాటు జెండా ఎగుర వేసిన పొంగులేటి వ్యతిరేకులను కూడగట్టటంలో సక్సెస్ అయ్యారు. కాంగ్రెస్ లోని అందరి నేతలతో పొంగులేటికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అటు దిల్లీ నుంచి ఇటు గల్లి వరకు పొంగులేటికి ఆదరణ పెరుగుతుండడంతో... రేవంత్ కు అలర్ట్ టైంగా మారుతోందని విశ్లేషకులు అంటున్నారు. గతంలో టీపీసీసీ చీఫ్ ప్రతీ నిర్ణయంలోనూ కీలకంగా ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి టీ కాంగ్రెస్ లో కనిపించటం లేదు. కాంగ్రెస్ హైకమాండ్ తెలంగాణలో పార్టీ వ్యవహారాలపై స్పష్టంగా ఉందనే చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

# పాతబస్తీకి మెట్రో పరుగులు, ఎంజీబీఎస్‌ఫలక్ నుమా మధ్య 5 స్టేషన్లు!



**జయభేరి, హైదరాబాద్ :**

హైదరబాద్ పాతబస్తీకి మెట్రో రైలు విస్తరణపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు 5.5 కిలోమీటర్ల మేర ఓల్డ్ సిటీ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. పాతబస్తీకి మెట్రో సేవలు విస్తరణపై తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో మెట్రో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ఎల్ అధికారులు ఎంజీబీఎస్‌ఫలక్‌నుమా మధ్య మెట్రో రైలు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు 5.5 కిలోమీటర్ల మేర ఓల్డ్ సిటీ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. నెలరోజుల్లో భూసేకరణకు నోటీసులు జారీ చేస్తామని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ రూట్ లో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్ గంజ్ , ఫలక్ నుమా ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు నిర్మిస్తామని వెల్లడించారు. ఈ మార్గంలో 103 మతపరమైన నిర్మాణాలు ఉన్నాయని, మెట్రో విస్తరణలో భాగంగా వీటిని తొలగించాల్సి ఉందన్నారు. ఎక్కువగా కట్టడాలను కూల్చకుండా 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేసి ఈ మార్గంలో మెట్రో పనులు ప్రారంభించాలని అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు. పాతబస్తీలో మెట్రో రైలు విస్తరణ పనులకు హెచ్ఎంఆర్ఎల్ కసరత్తు చేపట్టింది. గతంలో భూసేకరణలో సమస్యలు రావడంతో ఎంజీబీఎస్‌ఫలక్ నుమా మధ్య మెట్రో విస్తరణ నిలిచిపోయింది. అయితే తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో మెట్రో రైలు విస్తరణకు హెచ్ఎంఆర్ఎల్ కార్యచరణ సిద్ధం చేసింది. పాతబస్తీలో మెట్రో రైలు మార్గంలో మొత్తం 5 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ మార్గంలో మొత్తం 103 మతపరమైన నిర్మాణాలు ఉన్నాయని, వీటిలో 4 నిర్మాణాల విషయంలో సమస్యలు వచ్చాయన్నారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కరిస్తామవుతాయన్నారు. ఎంజీబీఎస్‌ఫలక్‌నుమా మార్గంలో 5.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని మంత్రి స్పష్టం చేశారు. మెట్రో రైలు తొలివిడతలో 69.2 కిలోమీటర్లు మేర మెట్రో రైలు మార్గాన్ని ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించింది. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై ఎల్ అండ్ టీ ఆసక్తి చూపలేదు. ఈ మార్గంలో మతపర కట్టడాలు ఎక్కువ ఉండడం, భూసేకరణలో సమస్యలు రావడంతో ఎల్ అండ్ టీ అప్పుడు చేతులెత్తేసింది. సుమారు ఆరేడు సంవత్సరాలుగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకూ 5.5 కిలోమీటర్ల మార్గం నిలిచిపోయింది. మతపరకట్టడాలు తొలగింపునకు గతంలో మజ్లిస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. రాయదుర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో సుమారు 2.7 కిలోమీటర్లు అదనంగా నిర్మించటంతో పాటు, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మార్గాన్ని కూడా పూర్తి చేస్తే మెట్రో రైలు మార్గం 74.7 కిలోమీటర్లు అవుతుంది.


# తెలంగాణలో 61శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు!

**జయభేరి, హైదరాబాద్ :**


తెలంగాణలోని మొత్తం ఎమ్మెల్యేల్లో 61శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు ఓ నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 44శాతం మంది ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నట్టు స్పష్టం చేసింది. దేశంలో ఎంత మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి? అన్న అంశంపై ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) విశ్లేషణ జరిపింది. మొత్తం మీద 44శాతం మంది ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నట్టు తేలింది! నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ)తో కలిసి ఈ విశ్లేషణ జరిపింది ఏడీఆర్. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో జరిగిన ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించి, ఈ రిపోర్టును తయారు చేశారు. 28 రాష్ట్ర అసెంబ్లీలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల్లోని 4,001 ఎమ్మెల్యేల అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. వీరిలో 1,136 మంది.. అంటే 28శాతం మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్టు తేలింది. మర్డర్, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి కేసులు సంబంధిత ఎమ్మెల్యేలపై ఉన్నాయి.

**రాష్ట్రాలవారిగా పరిస్థితి ఇలా..**

కేరళలోని 135ఎమ్మెల్యేల్లో 95మందిపై కేసులు ఉన్నాయి. ఇది 70శాతం! బిహార్లోని 242 ఎమ్మెల్యేల్లోని 161మందిపై (67శాతం), దిల్లీలోని 70మంది ఎమ్మెల్యేల్లో 44మందిపై (63శాతం), మహారాష్ట్రలోని 284మంది ఎమ్మెల్యేల్లో 175మందిపై (62శాతం), తెలంగాణలోని 118మంది ఎమ్మెల్యేల్లోని 72మందిపై (61శాతం), తమిళనాడులోని 224 ఎమ్మెల్యేల్లోని 134మందిపై (60శాతం) కేసులు నమోదయ్యాయి. ఈ వివరాలను ఎమ్మెల్యేలే స్వయంగా వారి అఫిడవిట్లలో పేర్కొన్నారు. ఇక అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసుల విషయంలో దిల్లీ టాప్లో ఉంది! దిల్లీలోని 53శాతం మంది ఎమ్మెల్యేలపై ఈ తరహా కేసులు ఉన్నాయి. బిహార్ (50శాతం), మహారాష్ట్ర (40శాతం), ఝార్ఖండ్ (39శాతం), తెలంగాణ (39శాతం), ఉత్తర్ ప్రదేశ్ (38శాతం) మంది ఎమ్మెల్యేలు అత్యంత తీవ్రమైన ఆరోపణలు. ఏడీఆర్ విశ్లేషణలో.. మహిళలపై నేరాలకు సంబంధించి బయపడింది. 114మంది ఎమ్మెల్యేలపై కేసులు ఉండగా.. వీరిలో 14మందిపై రేప్ కేసులు నమోదయ్యాయి!










# బోనమెత్తిన పీర్జాదిగూడ

**జయభేరి, హైదరాబాద్ :** దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ జక్కా కనివిని ఎరుగని రీతిలో బోనాల సంబరాలు.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలు కలిగి జీవించాలని, వారి ఇండ్లలో బంగారు పంట పండాలని ప్రత్యేకించి అభినందించారు.







తెలంగాణ సంప్రదాయ పండుగలో ఒకటైన బోనాల పండుగను 25వ డివిజన్ లోని క్రాంతికాలనీ పోచమ్మ,అంకాలమ్మ అమ్మవారి దేవాలయంను స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సతీసమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శించుకోని బోనం, నైవేద్యం, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోచమ్మ గుడి నిర్మాణ దాత, మాజీ సర్పంచ్ కుతాడి నర్సింహ ను కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి శాలువతో సన్మానించారు. అదేవిధంగా కార్పొరేటర్ దంపతులను క్రాంతి కాలనీ వాసులు శాలువతో సన్మానించారు...




## తమ్ముడు పోతరాజు ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు



**జయభేరి, మేడిపల్లి :**

అక్క తమ్ముళ్ల అనుబంధం కేవలం ప్రజల వరకే పరిమితం కాదని పురాణాల్లో కూడా ఈ బంధానికి ఎంతో విలువందని అమ్మవారి పలహార బండి ఊరేగింపులో ఎంతో సందడి చేసే పోతురాజులు అమ్మవారి తమ్ముళ్లుగా అమ్మవారిని తమ అక్కగా భావించి కోరిన కోరికలు తీర్చేందుకు అమ్మవారే స్వయంగా భక్తుల వద్దకే వెళ్లే అపూర్వ గట్టమే పలహార బండి ఊరేగింపు అని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ ఆరవ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ లు అన్నారు. కీసర మండలం చీర్యాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కోళ్ల నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమానికి టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ ఆరవ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో ప్రతి పండుగకు ఒక పరమార్థం, ప్రాముఖ్యత ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, యాదగిరి పల్లి గ్రామ అధ్యక్షులు హరి బాబు గౌడ్,మహేష్ గౌడ్, బాలరాజ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.







చిల్కానగర్ డివిజన్లోని సీతారామ కాలనీలో బోనాల పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు లో పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com



## దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టు నూతన కమిటీ ఎన్నిక చెల్లదు

### కాలనీ అధ్యక్షుడు బైరుగొండ మల్లేష్

**జయభేరి, మేడిపల్లి :**

కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టు ఏకపక్షంగా ఎన్నుకున్న నూతన కమిటీ చెల్లదని కాలనీ అధ్యక్షుడు బైరుగొండ మల్లేష్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టు లో అధ్యక్షుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేటర్ భర్త తన అగడాలకు కాలనీ అధ్యక్షుడైన నేను అడ్డువస్తున్నాడనే నెపంతో గతంలో అనుచరులతో దాడి చేశాదని,ఇప్పుడు ఎలాంటి సమాచారం లేకుండా ఐక్యంగా ఉన్న కాలనీలో అలజడి సృష్టించాలని కాలనీ కమిటీ పేరుతో కొందరు వ్యక్తులతో నూతన కమిటీ ఏర్పాటు చేయించాదని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నామన్నారు.నాపై కక్ష్యతో ఇలాంటివి చేస్తున్నారని,ప్రస్తుతం ఉన్న కాలనీ కమిటీ లేకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలు చెల్లవన్నారు.వచ్చే వారంలో కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సహాయం




**జయభేరి, ఘట్ కేసర్ :**

ఆపదలో ఉన్న పేదవారికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడమే లక్ష్యంగా సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు వై సుందర్ రావు తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సి నగర్ లోని సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నాగారం కు చెందిన తపేంద్ర కుమారుడు విజయ్ కుమార్ బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు వాచ్ మెన్ గా పనిచేసే తపేంద్ర ఆర్థికంగా పేదవాడు కావడంతో కుమారుడికి సరైన చికిత్సను అందించలేకపోతున్నాడు. విషయం తెలుసుకున్న సభ్యులు ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారున బాధితునికి రూ.11, 500 నగదును ఆదివారం అందజేశారు బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న తమ కుమారుడిని ఆదుకునేందుకు ఆర్థిక సహాయం అందించిన ట్రస్టు సభ్యులకు తపేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు మహేష్, వీరారెడ్డి, లింగస్వామి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



## బరువు తగ్గించే.. మసాలా ఓట్స్

ఓట్స్ అంటేనే ఆరోగ్యకరం. అయితే ఎప్పుడూ పాలల్లోనో, పెరుగులోనో కలుపుకుని తినేస్తుంటారు. రుచి నచ్చకపోయినా ఆరోగ్యం కోసమని అలాగే కానిచ్చేస్తుంటాం. అలాంటపుడు ఒకసారి ఈ మసాలా ఓట్స్ చేసి చూడండి. రుచికి రుచీ, ఆరోగ్యం కూడా. అల్పాహారంలోకి చాలా బాగుంటాయి. ముందుగా నూనెను ప్యాన్ లో వేసుకుని వేడెక్కాక జీలకర్ర వేసుకోవాలి. ఉల్లిపాయ సన్నని ముక్కలు కూడా వేసుకుని కలుపుకోవాలి.

1. ఇప్పుడు పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి ముద్ద కూడా వేసుకుని వేగనివ్వాలి. 2. టమాటా ముక్కలు కూడా వేసుకుని మెత్తబడ్డాక కూరగాయ ముక్కలన్నీ ఒక్కొక్కటిగా వేసుకోవాలి. 3. కూరగాయలు కాస్త మెత్తబడ్డాక కారం, గరం మసాలా, ఉప్పు వేసుకుని కలుపుకోవాలి. 4. సన్నని మంట మీద బాగా కలుపుకుని రెండు నుంచి మూడు కప్పుల నీళ్లు పోసుకోవాలి. 5. ఇప్పుడు నీళ్లు కాస్త వేడయ్యాక ఓట్స్ కూడా వేసుకుని కలుపుకోవాలి. 6. మరీ గట్టిగా అనిపిస్తే మరోకప్పు నీళ్లు పోసుకుని మెల్లగా కలుపుతూ ఉండాలి. 5 నిమిషాల్లో ఓట్స్ ఉడికిపోతాయి. 7. చివరగా కొత్తిమీర తరుగు వేసుకుని దించుకుంటే చాలు. మసాలా ఓట్స్ సిద్ధం.

# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్, ఆన్లైన్లో మళ్లీ 15 వేల స్పెషల్ దర్శనం టోకెన్లు

**జయభేరి, తిరుమల :**

తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం సాలకట్ల ఆణివార ఆస్థానం కారణంగా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవాణి ట్రస్టుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుమల అన్నమయ్య భవన్ లో నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయంలో సోమవారం సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహించనున్నట్లు తెలిపారు. పుష్పపల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని వెల్లడించారు. ఆణివార ఆస్థానం కారణంగా సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామన్నారు. దీంతో ఇవాళ వీఐపీ సిఫారసు లేఖలను అనుమతించలేదన్నారు. శ్రీవాణి ట్రస్టుపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఈవో ధర్మారెడ్డి భక్తులకు విజ్ఞప్తి చేశారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటి వరకూ 9 లక్షల మంది శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. కావాల్సిన వారికి ఆలయాల నిర్మాణ కాంట్రాక్టులు ఇస్తున్నట్లు మరో ఆరోపణ వచ్చిందన్నారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవన్నారు. జీర్ణోద్ధరణలో భాగంగా పార్వేట మండపాన్ని కూల్చివేసి, మళ్లీ నిర్మిస్తున్నామన్నారు. పార్వేట మండపాన్ని కూల్చివేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈవో ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు శ్రీవాణి ట్రస్ట్ కు రూ.880 కోట్ల విరాళాలు అందాయన్నారు. ఇప్పటి వరకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 2500 ఆలయాలను నిర్మాణం చేపట్టా




మన్నారు. శ్రీవారి ఆలయంలో భక్తుల తోపులాట లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. మహా ద్వారం నుంచి బంగారు వాకిలి వరకు సింగల్ లైన్ లో భక్తులను అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. వికలాంగులను, సీనియర్ సిటిజెన్స్ లను కలిపి కాకుండా విడిగా పంపుతామన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దర్శనాలకు పారదర్శకంగానే టోకెన్ల కేటాయిస్తున్నామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. పార్వేట మండపం పునర్ నిర్మాణంపై వివాదం సరికాదన్నారు. కుంగిపోయే స్థితిలో ఉండడంతో మండపాన్ని పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. వేసవితో సంబంధం లేకుండా తిరుమలకు భక్తులు వస్తున్నారన్నారు. వేసవిలో భక్తుల తాకిడి నేపథ్యంలో ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా తగ్గించామని, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మళ్లీ 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్లు ఆన్లైన్లో విడుదల చేస్తామని ఈవో ప్రకటించారు. జూన్ నెలలో శ్రీవారిని 23 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో ప్రకటించారు. హుండీ ద్వారా రూ.116.14 కోట్ల ఆదాయం లభించిందని వెల్లడించారు. జూన్ నెలలో కోటి ఆరు లక్షల లడ్డూలు విక్రయించామని, 10.80 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఈవో ధర్మారెడ్డి తెలిపారు.

# ఆ కాలేజీల్లో సీట్లన్నీ ఏపీ విద్యార్థులకే కేటాయింపు..ఉత్తర్వులు జారీ

**జయభేరి, హైదరాబాద్ :**

మెడికల్ సీట్ల కేటాయింపులో స్థానికత వ్యవహారం కొలిక్కి వచ్చింది. కొద్ది రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం కాంపెటీటివ్ కోటా సీట్లను స్థానికులకు మాత్రమే కేటాయించాలని నిర్ణయించింది. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా మెడికల్ సీట్ల భర్తీలో ఏపీ విద్యార్థులకు మాత్రమే స్థానికత వర్తింప చేయనుంది. రాష్ట్ర విభజన అమల్లోకి వచ్చిన 2014 జూన్ 2 తర్వాత ఏర్పడ్డ కళాశాలల్లో సీట్లన్నీ స్థానిక విద్యార్థులకే కేటాయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కొద్ది రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం జీవో 72 జారీ చేయడంతో ఏపీ కూడా అదే బాట పట్టింది.. 2014 తర్వాత మంజూరైన కొత్త మెడికల్ కాలేజీల్లో 100 శాతం రాష్ట్ర కోటా సీట్లు ఏపీ స్థానికత ఉన్న విద్యార్థులకే దక్కనున్నాయి. రాష్ట్రంలో 2014 జూన్ 2 తర్వాత ఏర్పాడిన ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ వైద్య కళాశాలలు, డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో వంద శాతం ఏపీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల నిబంధనల్లో సవరణలు చేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో 100 శాతం కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లను ఏపీ విద్యార్థులకు కేటాయించాలని నిర్ణయించడంతో మరికొన్ని సీట్లు ఏపీ విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. 2014 జూన్ 2 తర్వాత ఏర్పడ్డ వైద్య కళాశాలలతోపాటు కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను ఏపీ విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం సీట్లలో 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తున్నారు. మిగిలిన సీట్లను రాష్ట్ర



కోటాలో హెల్త్ యూనివర్శిటీ కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తోంది. ఆల్ ఇండియా కోటాలో భర్తీ అయ్యే సీట్లుకాకుండా మిగిలిన సీట్లలో 85 శాతం స్థానికులకు, 15 శాతం అన్ రిజర్వుడ్ విభాగాల కింద భర్తీ చేసేవారు. ప్రైవేట్ కళాశాలల్లో 50 శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద ఉండేవి. ఈ సీట్లలో 15 శాతం సీట్లను అన్ రిజర్వుడ్ కింద భర్తీ చేసేవారు. తాజా ఉత్తర్వుల ప్రకారం 2014 జూన్ 2 తర్వాత ఏర్పడిన కళాశాలలు, కొత్తగా మంజూరైన సీట్లలో 15 శాతంలోనూ తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఏపీ స్థానికత కలిగిన విద్యార్థులు ఈ సీట్లలో ప్రవేశాలు పొందొచ్చు. స్థానికత విషయంలో నిబంధనలను కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేరే రాష్ట్రంలో చదువుకున్న కాలం మినహాయించి రాష్ట్రంలో పదేళ్లు నివసించిన విద్యార్థులు, పదేళ్ల పాటు రాష్ట్రంలో నివసించిన పౌరుల పిల్లలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు కూడా స్థానిక కోటాలో అవకాశం కల్పిస్తారు. ప్రైవేటు కళాశాలల్లోని అన్ రిజర్వుడ్ సీట్లను కూడా మన రాష్ట్ర విద్యార్థులకే కేటాయిస్తారు. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 100 శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే దక్కనున్నాయి. అన్ రిజర్వుడ్ విభాగంలో అడ్మిషన్లకు తెలంగాణ విద్యార్థులకు ఇక అవకాశం ఉండదు. ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తోంది. 50 చొప్పున 750 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఆల్ ఇండియా కోటా 15 శాతం సీట్లు మినహాయిస్తే 128 చొప్పున సీట్లు రాష్ట్ర కోటాలోకి వస్తాయి. వీటితో కలిపి 2014 జూన్ 2 తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన కళాశాలల్లో 1,290 సీట్లు రాష్ట్ర కోటాలోకే వస్తాయి. వీటిలో 15 శాతం అంటే 193 సీట్లు అన్ రిజర్వుడ్ విభాగంలో ఉంటాయి. 2014 తర్వాత కొత్తగా మంజూరైన సీట్లలో 26 సీట్లు అన్ రిజర్వుడ్ విభాగంలోకి వస్తాయి. మొత్తం 219 సీట్లు పూర్తిగా ఏపీ విద్యార్థులకే దక్కనున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మాత్రమే కాకుండా వైద్య విద్య పీజీ సీట్లలోను 15 శాతం అన్ రిజర్వుడ్ కోటా సీట్లలో మన రాష్ట్ర విద్యార్థులకే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# నరసరావుపేటలో హైటెన్షన్, టీడీపీ నేత ఇంటిపై వైసీపీ శ్రేణులు దాడి!

**జయభేరి, నరసరావుపేట :**

పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం టీడీపీ, వైసీపీ నేతలు పరస్పరం దాడులకు దిగారు. టీడీపీ నేత చల్లా సుబ్బారావు ఇంటిపై వైసీపీ మద్దతుదారులు దాడి చేశారు. శనివారం టీడీపీ నేత చల్లా సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో ఎమ్మెల్యే గోపిరెడ్డి మద్దతుదారులు చల్లా సుబ్బారావు ఇంటిపై దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఈ దాడిలో చల్లా సుబ్బారావు ఇంటి కిటికీలు, ఫర్నిచర్ ధ్వంసం అయ్యాయి. కోటప్పకొండ రోడ్డులో ఉన్న ఈ ఇంటిని టీడీపీ నేత చల్లా సుబ్బారావు ఆక్రమించారని వైసీపీ నేతలు ఆరోపించాయి. టీడీపీ నేత ఇంటిపై దాడి విషయం తెలుసుకుని ఆ పార్టీ శ్రేణులు అక్కడిక భారీగా చేరుకున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య రాళ్లు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరు వర్గాల ఘర్షణలో పోలీస్ జీపు, టీడీపీ నేతలు కడియాల రమేశ్, అరవిందబాబు కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనలో అరవిందబాబు కారు డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపుతప్పడంతో... పోలీసులు రంగంలోకి ఇరు వర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలికి రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అతికష్టం మీది ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు పోలీసులు. నరసరావుపేటలో ఇంకా ఉద్రిక్తత కొనసాగుతోంది. కోటప్పకొండ మార్గంలో భారీగా పోలీసులను మోహరించారు. టీడీపీ నేత ఇంటిపై దాడిని పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీతో జీవీ ఆంజనేయులు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అవినీతిపై



ప్రశ్నిస్తే..దాడులు చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి దగ్గరుండి టీడీపీ నేత చల్లా సుబ్బారావు ఇంటిని వైసీపీ శ్రేణులతో ధ్వంసం చేయించారని ఆరోపించారు. పోలీసులు ఈ దాడిని అడ్డుకోకుండా... ఎమ్మెల్యేకు మద్దతుగా నిలిచారని విమర్శించారు. టీడీపీ నేతలపై దాడికి పాల్పడిన వైసీపీ నేతలతో పాటు ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు. టీడీపీ నేతలంతా నరసరావుపేట వచ్చి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

# లాల్ దర్వాజ బోనాల్లో చీకోటి ప్రవీణ్ అత్యుత్సాహం

## గన్స్ తో ఆలయంలోకి వెళ్లే ప్రయత్నం!





**హైదరాబాద్ :**

హైదరాబాద్ లాల్ దర్వాజ బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. లాల్ దర్వాజ అమ్మవారి దర్శనానికి వచ్చిన చికోటి ప్రవీణ్ అత్యుత్సాహం ప్రదర్శించారు. వెపన్స్ కలిగిన ప్రైవేట్ సెక్యూరిటీతో ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్ పాతబస్తీలో లాల్ దర్వాజ బోనాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు సింహ వాహిని మహంకాళి అమ్మవారివి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తుండడంతో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటుచేశారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

క్యాసినోల నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ లాల్ దర్వాజ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చి ఓవరాక్షన్ చేశారు. చీకోటి ప్రవీణ్ తన ప్రైవేట్ సెక్యూరిటీతో ఆలయంలోకి వెళ్లారు. చీకోటి ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. వారి వద్ద గన్స్ ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. జన సమూహంలోకి ప్రైవేటు సిబ్బందితో రావడం చట్టారీత్యా నేరమని పోలీసులు తెలిపారు. ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. వీరి వద్ద స్వాధీనం చేసుకున్న వెపన్స్‌కు లైసెన్స్ లేకపోతే కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. బోనాలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ మద్యం షాపులను బంద్ చేసింది. అయితే అక్రమ మార్గంలో కొందరు మద్యం విక్రయిస్తున్నారు. కుత్బుల్లాపూర్, సుభాష్‌నగర్, సూరారం, జీడిమెట్ల, సూరారం ప్రాంతాలలో జోరుగా బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. మద్యం షాపులు బంద్ అవ్వడంతో బెల్ట్ షాపు యజమానులు ఇష్టానుసారంగా మద్యం అమ్ముతున్నారు. ఇష్టారీతిన అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా.... అధికారుల స్పందించలేదని సమచారం. పాతబస్తీ లాల్ దర్వాజ సింహ వాహిని అమ్మవారికి, అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబేలా బోనాలు నిర్వహించుకుంటున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఏటా ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. లాల్ దర్వాజ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. లష్కర్ బోనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు.

# ఆలిండియా కోటాతో పాటు కన్వీనర్ కోటా మెడికల్ సీట్ల భర్తీ



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో ఆలిండియా కోటా మెడికల్ సీట్ల భర్తీతో పాటు కన్వీనర్ కోటాలో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లను కూడా భర్తీ చేసేందుకు కాళోజీ హెల్త్ యూనివర్శిటీ సిద్ధమవుతోంది. ఆలిండియా కోటా రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యే తేదీనే కన్వీనర్ కోటా సీట్ల భర్తీ కూడా ప్రారంభించే అవకాశాలున్నాయి. నీట్ ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు జులై 20 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఆల్ఇండియా కోటా సీట్ల భర్తీకి షెడ్యూలు విడుదలైంది. 202324 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఆలిండియా కోటా సీట్లను భర్తీ చేయడానికి జాతీయ వైద్య కమిషన్ శ్రీకారం చుట్టింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ అడ్మిషన్ల షెడ్యూలును విడుదల చేసింది. జులై 20 నుంచి రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 శాతం ఆలిండియా కోటా సీట్లతో పాటు డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఎయిమ్స్ క్యాంపస్‌లు, పాండిచ్చేరిలోని జిప్‌మర్ క్యాంపస్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీనర్సింగ్ సీట్లను భర్తీ చేయనున్నారు. ఆలిండియా కోటా కౌన్సెలింగ్ నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. మొదటి విడత సీట్ల కేటాయింపు జులై 27, 28 తేదీల్లో నిర్వహిస్తారు. రెండో విడత ఆగస్టు 16, 17తేదీల్లో, మూడో విడత సెప్టెంబరు 6, 7 తేదీల్లో జరుగుతుంది. మూడు విడతల కౌన్సిలింగ్ పూర్తైన తర్వాత మిగిలిన సీట్లను చివరి విడతలో కేటాయిస్తారు. తెలంగాణలో ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఫస్టియర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ నేడో రేపో విడుదల కానుంది. ఆలిండియా కోటాలో అడ్మిషన్ల ప్రక్రియకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ హెల్త్ యూనివర్శిటీ షెడ్యూలు విడుదల చేయనుంది.

ఒకేసారి ఆలిండియా కోటా సీట్లకు, కన్వీనర్ కోటాలో భర్తీ చేసే సీట్లకు కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ ఏడాది నుంచే దేశవ్యాప్తంగా అమలు చేయనున్నారు.నీట్ మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ విడుదల చేసిన కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకారమే తెలంగాణలో కాళోజీ విశ్వవిద్యాలయం కూడా అనుసరించే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి షెడ్యూలును సోమవారం విడుదల చేసే అవకాశం ఉందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి అభ్యర్థుల నమోదు ప్రక్రియ శుక్రవారం ముగిసింది. జాతీయస్థాయి అర్హత పరీక్ష నీట్‌యూజీ 2023 ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు, ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. జులై 20 నుంచి జులై 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ అనుమతిస్తారు. జులై 22 నుంచి 26 వరకు చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ అవకాశం ఉంటుంది. జులై 27, 28 తేదీలలో సీట్లు కేటయిస్తారు. జులై 29 ఫలితాలు వెలువడుతాయి. జులై 30న ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

జులై 31 ఆగస్టు 4 వరకు కాలేజీల్లో జాయినింగ్ రిపోర్ట్ అందించాల్సి ఉంటుంది. ఆగస్టు 9 నుంచి ఆగస్టు 14 వరకు రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్‌కు అవకాశం ఉంటుంది. ఆగస్టు 16, 17 సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగష్టు 18న ఫలితాలు వెల్లడిస్తారు. ఆగష్టు 19న సర్టిఫికెట్లు అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆగష్టు 20 నుంచి28వ తేదీ వరకుకాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 4 వరకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తారు. సెప్టెంబరు 1 నుంచి 5 వరకు చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

సెప్టెంబరు 6, 7 తేదీల్లో సీట్లను కేటాయిస్తారు. సెప్టెంబర్ 8న ఫలితాలువెల్లడిస్తారు. సెప్టెంబరు 9న సర్టిఫికెట్లు అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 10 నుంచి 18 వరకు కళాశాలల్లో జాయినింగ్ రిపోర్ట్ అందించాల్సి ఉంటుంది. చివరి విడత అడ్మిషన్లకు సెప్టెంబరు 21 నుంచి 23వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబరు 22 నుంచి 24 వరకు చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. సెప్టెంబరు 25 సీట్లు కేటాయిస్తారు. సెప్టెంబర్ 26న ఫలితాలు వెలువడితే సెప్టెంబర్ 27 నుంచి 30 తేదీ వరకు జాయినింగ్ రిపోర్ట్ అందించాల్సి ఉంటుంది.

# మహబూబాబాద్ బీఆర్ఎస్ లో వర్గపోరు,

## ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ వర్గం రహస్య భేటీలు!





**మహబూబాబాద్:**

అధికార బీఆర్ఎస్ లో నేతల మధ్య వర్గవిభేదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ వర్గపోరు మళ్లీ మొదలైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు వర్గం వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. నెల్లికుదురు మండలం మదనతుర్తిలో మామిడి తోటలో ఈ సమావేశం జరగగా... దీనిని అడ్డుకోవడానికి శంకర్ నాయక్ వర్గం ప్రయత్నించింది. ఎమ్మెల్యే శంకర్ నాయక్ కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వర్గీయులు వరుసగా సమావేశాలు నిర్వహిస్తుండడం చర్చనీయాంశం అయింది. బీఆర్ఎస్ నేతలను, ప్రతినిధులను ఎమ్మెల్యే శంకర్ నాయక్ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈసారి శంకర్ నాయక్ కు టికెట్ ఇస్తే బీఆర్ఎస్ ఓటమి తప్పదని వారంతా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లికుదురు మండలంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు వర్గీయులు సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ నాయక్ వర్గీయులు అక్కడకు చేరుకుని ఎమ్మెల్యేకు మద్దతుగా నినాదాలు చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలు అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీఆర్ఎస్ నేతలు రచ్చకెక్కి విమర్శలు చేసుకోవడంతో... పార్టీకి నష్టం తప్పదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్యే శంకర్ నాయక్ కు టికెట్ ఇవ్వొద్దని సొంత పార్టీ నేతలో అంటున్నారు. శంకర్ నాయక్ కు టికెట్ ఇస్తే కచ్చితంగా బీఆర్ఎస్ ఓడిపోతుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. శంకర్ నాయక్ ను రెండు సార్లు గెలిపిస్తే భూ కబ్జాలు, రక్తపాతం సృష్టించారని ఆరోపిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు శంకర్ నాయక్. 2009లో బీఆర్ఎస్ పార్టీలో చేరి... తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి మాలోత్ కవితపై విజయం సాధించారు. 2018లో బలరాం నాయక్ పై గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. శంకర్ నాయక్ నిత్యం వివాదాలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. ఈసారి శంకర్ నాయక్ కు టికెట్ ఇవ్వొద్దని సొంత పార్టీ నేతలే డిమాండ్.

# కలిసికట్టుగా ఉంటే సమస్యలు పరిష్కారం

## 13వ డివిజన్ కార్పోరేటర్ దానగళ్ళ అనితా యాదగిరి



**జయభేరి, మేడిపల్లి :**


కలిసికట్టుగా ఉంటే కాలనీ సమస్యలు పరిష్కారం అవుతాయని 13వ డివిజన్ కార్పోరేటర్ దానగళ్ళ అనితా యాదగిరి అన్నారు.ఆదివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ 11 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సల్ల నర్సింహ్మ,ప్రధాన కార్యదర్శిగా కోరం నాణభూషణం, కోశాధికారి మల్లేపాక శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యూత్ అధ్యక్షుడుగా పల్లెర్ల నాగేష్, ప్రధాన కార్యదర్శిగా బెక్కం శివ కుమార్ లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్పోరేటర్ శాలువాతో సన్మానించి,కాలనీ అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు

## చుక్కలు చూపిస్తున్న కూరగాయల ధరలు



కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కిచెన్ బడ్జెట్ డబుల్ కావటంతో వినియోగదారులు చుక్కులు చూస్తున్నారు. ఇక టమాట ధరలతో పోల్చితే చికెన్ బెటర్ అన్నట్లు ఉంది తాజా పరిస్థితి. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు! అన్నట్లు ఉంది వినియోగదారుల పరిస్థితి. గత కొద్దిరోజులుగా కూరగాయలు ధరలు భారీగా పెరిగాయి. దీంతో ప్రజలు... కూరగాయలు అంటేనే బెంబేలెత్తిపోతున్నారు. దేశవ్యాప్తంగానూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక టమాటా ధరల గురించి చెప్పే పరిస్థితే లేదు. కొండెక్కి కూర్చున్న ధరలతో.... సామాన్యులు కొనే కనిపించటం లేదు. కేజీ టమాటా ధరతో పోల్చితే....కేజీ చికెన్ వస్తుందంటే సీన్ ఎలా ఉందో సింపుల్ గా అర్థం చేసుకోవచ్చు. అన్ని రాష్ట్రాల్లో దాదాపు కేజీ టమాట ధర 150కు పైగా పలుకుతుంది. పలుచోట్ల అయితే 200 దాటిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో టమాటాతో కూర అంటేనే భయపడిపోతున్నారు. చేతినిండా డబ్బులతో మార్కెట్ కు వెళ్తున్న వినియోగదారులు...వట్టి చేతులతో వెనక్కి వచ్చేస్తున్నారు. ఉన్నంతలోనే కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే... కిలో టమాట ధర రూ.150 నుంచి రూ.200 దాకా పలుకుతుండడంతో టమాట కొనాలంటేనే సామాన్యులు బెంబేళెత్తిపోతున్నారు. దాదాపు నెల క్రితం రాష్ట్రంలో కిలో టమాట ధర రూ. 50లోపే ఉంగా ఇప్పుడు రూ.150 నుంచి రూ.200 మధ్యన అమ్ముడవుతోంది. జిల్లా కేంద్రాల్లో కంటే గ్రామాల్లోనే టమాట ధరలు అధికంగా ఉండడంతో పేద, సామాన్యులు టమాట కొనాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.



టమాట ధరలే కాదు... పచ్చి మిర్చి కూడా తెగ ఘాటెక్కిపోయింది. కేజీ పచ్చి మిర్చి రూ. 140 నుంచి రూ. 160 మధ్య నడుస్తోంది. ఫలితంగా ప్రతి కూరలో కీలకమైన టమాటా, పచ్చి మిర్చి ధరలు పెరగటంతో సామాన్యులు పట్టపగలే చుక్కులు చూస్తున్నారు. టమాట ధరలు వారం, పది రోజుల్లో తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా... ఆ దిశగా పరిస్థితులు కనిపించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. దేశంలోని పలు చోట్ల ఎడతెరపిలేని వర్షాలు, అల్ప వర్షాల కారణంగా రానున్న రోజుల్లో టమాటా ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత మూడు వారాల నుంచి అటు రిటైల్ మార్కెట్‌లోనూ ఇటు హోల్ సేల్ మార్కెట్లోనూ టమాటాలను అధిక ధరలకే విక్రయించారు. జూన్‌తో పోలిస్తే జులైలో టమాటా ధరలు ఏకంగా 326.13శాతానికి పైగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మొన్నటి వరకు చికెన్ ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. కేజీ ధర రూ. 350 దాటిన పరిస్థితి కనిపించింది. వర్షాలు మొదలైన తర్వాత... క్రమంగా చికెన్ ధరలు తగ్గుతున్న పరిస్థితి ఉంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు చూస్తే... ప్రస్తుతం మార్కెట్‌లో కిలో లైవ్ బర్డ్ రూ.110, కేజీ స్కిన్‌తో అయితే రూ.180 200గా ఉంటే... స్కిన్‌లెస్ రూ.210 220 మధ్య విక్రయిస్తున్నారు. ఇక మరికొద్దిరోజుల్లో శ్రావణ మాసం రాబోతుంది. మొన్నటి వరకు పెళ్లిళ్ల సీజన్, ఎండాకాలంలో కోళ్లు చనిపోవటంతో ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. శ్రావణం షురూ అయితే... చాలా మంది మాంసాహారం ముట్టకపోటంతో చికెన్‌కు డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. దీంతో ధరలు అమాతం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం కూరగాయులు ధరలు ఆకాశన్నంటిన తరుణంలో చికెన్ ధరలు తగ్గటం ఊరటనిచ్చే అంశమే. ప్రస్తుతం కిలో టమాటా రూ. 100 నుంచి 150 పైగా పలుకుతుండగా.. కేజీ టమాటకు బదులుగా అర కేజీ చికెన్ తెచ్చుకొని తినటం బెటర్ అని చాలా మంది భావిస్తున్నారు.



## బీహార్‌లో పిడుగులు పడి 18మంది మృతి

వర్షా కాలం వల్ల బీహార్‌లో మెరుపులో,ఉరుములతో కూడిన వర్షం కురుస్తోంది. వివిధ జిల్లాల్లో పిడుగుల పడి 24 గంటల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. రోహతాస్ జిల్లాల్లో అయిదుగురు, అర్వాల్‌లో నలుగురు, శరన్‌లో ముగ్గురు, ఔరంగబాద్‌లో ఇద్దరు, బంకావైశాలి జిల్లాల్లో ఒక్కొక్కరు ఉన్నారు. పిడుగుల వల్ల మృతిచెందిన బాధితులకు 4 లక్షల పరిహారాన్ని ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ ఏజెన్సీ అభ్యర్థన చేసింది. గ్రామాల్లో ఉంటున్న ప్రజలు వర్షం కురుస్తున్నప్పుడు వ్యవసాయ క్షేత్రాల్లోకి, పొలాల్లోకి వెళ్లవద్దు అని ఆ ఏజెన్సీ పేర్కొన్నది. కరెంటు పోల్స్, మట్టి ఇండ్ల వద్ద కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షం పడుతున్న సమయంలో కిటికీల వద్ద ఉండవద్దు అని సూచించారు. ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఎలక్ట్రిక్ పరికరాలను వర్షం వేళ తాకరాదు అని డిజాస్టర్ మేనేజ్మెంట్ తెలిపింది.



## ఉత్తరాఖండ్‌లో విరిగిపడుతున్న కొండచరియలు

ఉత్తరాది రాష్ట్రాల్లో ఇంకా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాల ధాటికి లోయలు, కొండలతో కూడిన చార్‌ధామ్ మార్గాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. ముఖ్యంగా యమునోత్రి, బద్రీనాథ్ మార్గాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నది. వర్షాల కారణంగా చామి పట్టణ సమీపంలో యమునోత్రి హైవే 123 పై కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో ఆ హైవేను పూర్తిగా మూసివేశారు. అదేవిధంగా బద్రీనాథ్ మార్గంలో కూడా వర్షాలవల్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. చమోలీ జిల్లాలో పలు చోట్ల హైవేపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో ఆ మార్గాన్ని కూడా తాత్కాలికంగా మూసివేశారు. పితోరగఢ్ జిల్లాలో కూడా దార్చులాతవాఘాట్ లిపులేఖ్ రహదారిలోని ఐదారు ప్రాంతాల్లో పెద్ద పెద్ద బండరాళ్లు విరిగిపడ్డాయి. దాంతో ఆ రహదారిని కూడా మూసివేశారు.




## పెళ్లి జరిగిన రెండు గంటలకే ట్రిపుల్ తలాఖ్

కట్నం కింద కారు ఇవ్వలేదని పెండ్లి అయిన రెండు గంటలకే నవ వధువుకు ట్రిపుల్ తలాఖ్ చెప్పాడో ఘనుడు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలోని ఫతేహాబాద్‌కు చెందిన క్రమాన్ వాసీ తన ఇద్దరు సోదరీమణులు డాలీ, గౌరీలకు ఒకే రోజు నిఖా జరిపించాడు. వివాహం అనంతరం గౌరీని ఆమె అత్తారింటివారు తీసుకెళ్లారు. అయితే డాలీని నిఖా చేసుకున్న వరుడు మొహమ్మద్ ఆసిఫ్ మాత్రం కట్నంలో భాగంగా తనకు కారు ఇవ్వలేదని అలిగాడు.
తనకు కట్నం కింద కారు ఇస్తామని మాట ఇచ్చారని, ఇప్పుడు అది కనిపించడం లేదని డాలీ తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తంచేశాడు. వెంటనే కార కొనివ్వాలని లేదా రూ.5 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే ఇప్పటికిప్పుడు ఆ రెండూ ఇవ్వడం తమవల్ల కాదని వారు చెప్పారు. దీంతో ఆసిఫ్ ఆ నవ వధువుకు ట్రిపుల్ తలాఖ్ చెప్పి, తన కుటుంబంతో వివాహ వేదిక నుంచి వెళ్లిపోయాడు. వధువు సోదరుడు క్రమాన్ వాసీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆసిఫ్‌తోపాటు మరో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఏడుగురినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముస్లింల వివాహం చట్టం2019 ప్రకారం ట్రిపుల్ తలాఖ్ చెప్పి మహిళలకు విడాకులు ఇవ్వడం క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు.

## అమెరికా నుంచి జపాన్ వరకు రెడ్ అలర్ట్..
# భయపడిపోతున్న ప్రజలు!



వాతావరణ మార్పులతో ప్రపంచంపై పడుతున్న ప్రతికూల ప్రభావానికి అద్దం పట్టే మరో సంఘటన! హీట్వేవ్తో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతున్నాయి. అమెరికాలో పరిస్థితులు అంత్యంత ఆందోళనకరంగా ఉండగా.. యూరోప్, పశ్చిమాసియా, జపాన్లు భారీ ఉష్ణోగ్రతలను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి జపాన్ వరకు అనేక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ అవ్వడం గమనార్హం.

**అమెరికాలో ఇలా..**

గ్లోబల్ వార్మింగ్ ప్రభావం అమెరికాలో స్పష్టంగా కనిపిస్తోంది. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ వారాంతంలో.. కాలిఫోర్నియా నుంచి టెక్సాస్ వరకు ఉష్ణోగ్రతలు భయానకంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు. సాధారణం కన్నా 10 నుంచి 20 డిగ్రీల ఫారెన్హైట్ టెంపరేచర్ నమోదవుతుందని అంచనా వేశారు. ఆరిజోనా రాష్ట్రంలో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. రాజధాని నగరం ఫీనిక్స్లో వరుసగా 16 రోజుల పాటు సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏసీల్లో కూర్చున్నప్పటికీ.. ప్రజలు చెమటలు ఛిందిస్తున్నారు! మరోవైపు భూమిపై ఉష్ణోగ్రతలు అత్యంత ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో ఒకటైన కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీ.. తాజా పరిస్థితులతో అల్లాడిపోతోంది. అక్కడ ఉష్ణోగ్రతలు ఆదివారం 54 డిగ్రీల సెల్సియస్ను తాకుతాయని వాతావరణశాఖ అంచనా వేసింది. ఉదయం పూట ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, నిత్యం హైడ్రేటెడ్గా ఉండాలని సూచనలు జారీ చేశారు. కానీ ప్రజలపై ఇప్పటికే ప్రతికూల ప్రభావం పడింది! మంచి నీరు తాగుతున్నా వాంతులు అవుతున్నాయని చాలా మంది చెబుతున్నారు.

**యూరోప్లో ఇలా..**

ఇక గ్లోబల్ వార్మింగ్ రెడ్ అలర్ట్ను ఎదుర్కొనేందుకు యూరోప్ సన్నద్ధమవుతోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటలీ, రోమ్తో పాటు 16 నగరాల్లో రెడ్ అలర్ట్ జారీ అయ్యింది. "దేశ చరిత్రలోనే అతిపెద్ద హీట్వేవ్కు ప్రజలు సిద్ధంగా ఉండాలి," అని ఇటలీ ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు రోమ్లో సోమవారం నాటికి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతాయని, మంగళవారం నాటికి 43 డిగ్రీలకు చేరుకుంటాయని తెలుస్తోంది. 2007 ఆగస్ట్ తర్వాత ఇదే అత్యధికం! ఫ్రాన్స్లో కూడా హీట్వేవ్ పరిస్థితులు ఇలాగే ఉన్నాయి! జూన్లో హీట్వేవ్తో అల్లాడిపోయిన ప్రజలు.. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులే ఎదురవుతాయి అంటుంటే ఆందోళన చెందుతున్నారు.

**జపాన్.. ఇండియా..**

జపాన్లో వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆది, సోమవారం నాటికి టెంపరేచర్ 38,39 డిగ్రీల సెల్సియస్ను తాకే అవకాశం ఉందని, ఇదే జరిగితే గత రికార్డు బ్రేక్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అనేక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. మూడు నెలల పాటు హీట్వేవ్తో అల్లాడిపోయిన భారతీయులు.. ఇప్పుడు భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు! ముఖ్యంగా ఉత్తర భారతంలో పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్లలో కొన్ని రోజుల క్రితం వరకు అతి భారీ వర్షాలు కురిసి, ప్రజలను ఇబ్బంది పెట్టాయి. ఇక దిల్లీలో పరిస్థితుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది! యమునా నది ఉప్పొంగడంతో దిల్లీలోని రోడ్లు జలమయం అయ్యాయి.

## నెల రోజుల్లో కోటీశ్వరుడైన రైతు..
# అంతా 'టమాటా' మాయ!

ఓ రైతు.. టమాటాలను విక్రయించి, నెల రోజుల్లో కోటీశ్వరుడైపోయాడు! మహారాష్ట్రలో జరిగింది ఈ ఘటన. దేశంలో టమాటా ధరల మంట గురించి గత కొన్ని రోజులుగా వింటూనే ఉన్నాము. సరైన సమయానికి పంట చేతికి అందకపోవడంతో రేట్లకు రెక్కలొచ్చాయి. మధ్యతరగతి ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. వీటన్నింటి మధ్య తాజాగా ఓ వార్త బయటకొచ్చింది. టమాటాలను పండించే ఓ రైతు.. నెల రోజుల్లో ఏకంగా కోటీశ్వరుడు అయిపోయాడు!

**టమాటా 'పంట పండింది'..!**

మహారాష్ట్ర పూణె జిల్లా నుంచి ఈ కథ వెలుగులోకి వచ్చింది. తుకారామ్ భగోజి గయాకర్ అనే వ్యక్తికి 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులోని 12 ఎకరాల్లో టమాటాలను పండిస్తాడు. కొడుకు ఈశ్వర్ గయాకర్, కోడలు సొనాలి ఆయనకు సాయం చేస్తారు. పంట పెంచేందుకు ఎలాంటి ఎరువులు వాడాలి? ఎలాంటి వాడకూడదు? ఏం చేస్తే మంచి పంట పండుతుంది? వంటి విషయాలు వారికి తెలుసు. అందుకే భారీ మొత్తంలో నాణ్యమైన టమాటాలను పండిచగలిగారు. ఫలితంగా వారి ఇంట్లో కాసుల వర్షం కురిసింది. నెల రోజుల వ్యవధిలో 13వేల టమాటా క్రేట్ (బాక్సు)లను విక్రయించిన తుకారామ్.. ఏకంగా రూ. 1.5కోట్లను సంపాదించాడని సమాచారం! నారాయణ్గంజ్ మార్కెట్లో ఒక్క టమాటా క్రేట్ను ఓ రోజు రూ. 2100కి అమ్మాడు. ఇక శుక్రవారం ఏకంగా 900 క్రేట్లను విక్రయించాడు. ఫలితంగా ఒక్కరోజులోనే రూ. 18లక్షల వరకు సంపాదించాడు. నాణ్యత ఆధారంగా టమాటా రేట్లు పలుకుతున్నాయి. బెస్ట్ క్వాలిటీ టమాటాలు పండిస్తుండటంతో.. గత నెలలో ఒక్కో క్రేట్ను రూ. 1000 నుంచి రూ. 2400 వరకు అమ్మేవాడు తుకారామ్. ఇలా ఒక్క నెలలో కోటీశ్వరుడైపోయాడు! తుకారామ్ ఒక్కడే కాదు.. ఆ ప్రాంతంలో టమాటాలను పండించే చాలా మంది రైతులది కూడా ఇదే పరిస్థితి. పంట చేతికి వచ్చే సరికి, టమాటాలకు భారీ డిమాండ్ కనిపిస్తుండటంతో మిలియనీర్లు అయిపోయారు. ఇక నారాయణ్గంజ్లోని జున్నా అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీకి.. ఒక్క టమాటా వ్యాపారంతోనే నెలలో రూ. 80కోట్లు వచ్చినట్టు తెలుస్తోంది. ఇక్కడ నాణ్యమైన టమాటాల క్రేట్ (20కేజీలు) ధర రూ. 2,500కి కూడా విక్రయించారు. తాజా పరిస్థితుల మధ్య 100మంది మహిళలకు ఉపాధి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.



**టమాటాలకు కాపల..!**

ఆకాశాన్ని తాకుతున్న టమాటా ధరలతో కొందరు రైతులు భారీ లాభాలను పొందుతుంటే.. ఇంకొందరు మాత్రం భయపడిపోతున్నారు. టమాటా పంటతో భారీ ఆదాయం వచ్చిన రైతులను కొందరు టార్గెట్ చేస్తున్నారు. ఈ విధంగానే.. ఆంధ్రప్రదేశ్లోని అన్నమయ్య జిల్లాలో ఓ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. మదనపల్లి బోడిమల్లదిన్న గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి టమాటా పంట పండించి మార్కెట్లో అమ్ముతూ ఉంటాడు. టమాటా రేటు భారీగా పెరగడంతో గత 20 రోజుల్లోనే 30 లక్షల రూపాయల రాబడి వచ్చింది. డబ్బు కోసం ఆయనని హత్య చేయాలని కొందరు వ్యక్తుల కన్నుఆయన మీద పడింది.

## ఒకేసారి 150 మోమోలు తిన్న యువకుడు.. అస్వస్థతకు గురై మృతి

పందెం.. ఓ యువకుడి నిండు ప్రాణాలను బలి తీసుకున్నది. ఒకేసారి 150 మోమోలు తినడంతో, తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోపాల్‌గంజ్‌కు చెందిన బిపిన్ కుమార్ పాశ్వాన్(25) మొబైల్ రిపేర్ షాపు నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం పాశ్వాన్ తన స్నేహితులను కలిశాడు. అందరూ కలిసి ముచ్చటిస్తుండగా, మోమోలు ఎవరు ఎక్కుత తింటారో చూద్దామని ఫ్రెండ్స్ పందెం కాశారు. ఆ తర్వాత పాశ్వాన్ ఏకంగా 150 మోమోలను తిన్నాడు. తీవ్ర అస్వస్థతకు గురైన పాశ్వాన్ స్పృహా కోల్పోయాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పాశ్వాన్ ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాశ్వాన్ డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**విష ప్రయోగం జరిగిందంటున్న తండ్రి..**

తన కుమారుడిపై అతని స్నేహితులు విష ప్రయోగం జరిపారని పాశ్వాన్ తండ్రి ఆరోపించారు. పాశ్వాన్‌ను కావాలనే చంపారని పేర్కొన్నాడు. కావాలనే మోమోలో విషం నింపి, పందెం కాశారని, అవి తినడంతో చనిపోయాడని పేర్కొన్నాడు తండ్రి. తమ కుమారుడి మృతి కేసులో విచారణ జరిపి, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

## యూకే వెళుతున్న వారికి బ్యాడ్ న్యూస్.. భారీగా పెరిగిన వీసా ఫీజు!

యూకేకు వెళ్లాలని ప్లాన్ చేస్తున్న భారతీయులకు బ్యాడ్ న్యూస్! వీసా ఫీజులను పెంచుతూ.. ఆ దేశ ప్రధానమంత్రి రిషి సునక్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వీసా ఫీజుతో పాటు దరఖాస్తుదారులు చెల్లించే హెల్త్ సర్చార్జీలను కూడా పెంచుతున్నట్టు స్పష్టం చేశారు. ఎంత పెంపు ఉంటుంది? అన్న విషయంపై ప్రస్తుతానికి క్లారిటీ లేదు. కానీ వీసా ఫీజు 15శాతం నుంచి 20శాతం వరకు పెరగొచ్చు అని పలు నివేదికలు చెబుతున్నాయి. యూకేలోని పబ్లిక్ సెక్టార్లో పనిచేస్తున్న వారి జీతాలను పెంచేందుకు రిషి సునక్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు, జూనియర్ డాక్టర్లు,ఇతర వర్కర్లు ఈ కేటగిరీ కిందకి వస్తారు. కనీసం 5 7శాతం వరకు వారి జీతాలను పెంచే యోచనలో ఉన్నట్టు బ్రిటన్ ప్రధాని ఇప్పటికే తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అయితే.. ద్రవ్యోల్బణంపై భయాలు కొనసాగుతున్న వేళ, అప్పు చేసి జీతాలు పెంచే ఉద్దేశం లేదన్న ఆయన.. అందుకే వేరే మార్గాల ద్వారా నిధులను సమీకరిస్తున్నట్టు స్పష్టం చేశారు. "పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల జీతాన్ని పెంచాలని నిర్ణయించుకుంటే.. వేరే ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చుకోవాలి. ప్రజల ట్యాక్స్ల నుంచి తీసే ఉద్దేశం నాకు లేదు. ద్రవ్యోల్బణం భయాల కారణంగా అప్పు చేయాలనీ లేదు," అని మీడియా సమావేశంలో వెల్లడించారు రిషి సునక్. "అందుకే నిధుల కోసం కొన్ని మార్గాలను చూస్తున్నాము. దేశంలోకి వచ్చే ఇమ్మిగ్రెంట్స్పై వేసే ఛార్జీలను పెంచాలని భావిస్తున్నాము. ఎన్హెచ్ఎస్ (నేషనల్ హెల్త్ సర్వీస్) సేవలు పొందేందుకు వీసా సమయంలో కొంత చెల్లించాల్సి ఉంటుంది. దానిని పెంచుతున్నాము. దీని ద్వారా మేము 1 బిలియన్ బ్రిటన్ పౌండ్ను సమకూర్చుకోగలుగుతాము. వీసా ఫీజులు పెంచి చాలా రోజులైంది.
అందుకే ఇప్పుడు పెంచాలని మేము తీసుకున్న నిర్ణయం సరైనదే," అని ప్రధాని పేర్కొన్నారు.




పలు నివేదికల ప్రకారం.. వర్కింగ్ వీసా ఫీజు 15శాతం పెరగనుంది. ఇతర వీసాలపై ఛార్జీలు 20శాతం పెరుగుతాయి. 2015లో తొలిసారిగా ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్చార్జ్ను ప్రవేశపెట్టారు. అప్పట్లో అది అప్లికేషన్కు 200 పౌండ్లుగా ఉండేది. 2018 నాటికి అది 400 పౌండ్లకు చేరింది. 2020కి 620 పౌండ్లు దాటేసింది. ఇక ఇప్పుడు ఈ ధర 1,035 పౌండ్లకు చేరుతుందని తెలుస్తోంది. అయితే తాజా పెంపునకు సంబంధించిన వివరాలపై రానున్న నెలల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వ చర్యలతో.. అమెరికా, ఫ్రాన్స్తో పోల్చుకుంటే.. బ్రిటన్లో పని కోసం వెళ్లే వారిపై అధిక భారం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

# టీమిండియాకు షాకిచ్చిన బంగ్లాదేశ్..

# చరిత్రలో తొలిసారి ఇలా..

తొలి వన్డేలో టీమిండియాను బంగ్లాదేశ్ మహిళల జట్టు ఓడించింది. వన్డేల్లో బంగ్లా చేతిలో ఓడడం భారత మహిళల జట్టుకు ఇదే తొలిసారి. బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల జట్టుకు భారీ షాక్ తగిలింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు (జూలై 16) జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ చేతిలో 40 పరుగుల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది. వన్డేల్లో బంగ్లా చేతిలో భారత మహిళల జట్టు ఓడిపోవడం చరిత్రలో ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభానికి ముందు వర్షం పడటంతో ఈ మ్యాచ్‌ను 44 ఓవర్లకు అంపైర్లు కుదించారు. మిర్పూర్ వేదికగా జరిగిన ఈ తొలి వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 43 ఓవర్లలో 152 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. భారత పేసర్ అమన్‌జోత్ కౌర్ అరంగేట్ర మ్యాచ్‌లో అదరగొట్టి నాలుగు వికెట్లు పడగొట్టింది. వేదిక వైద్యకు రెండు, దీప్తి శర్మకు ఓ వికెట్ దక్కింది. అయితే, స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేక టీమిండియా ఓడిపోయింది. 35.5 ఓవర్లలోనే 113 పరుగులకే భారత జట్టు ఆలౌటైంది. దీప్తి శర్మ (20) మినహా భారత బ్యాటర్లలో ఎవరూ కనీసం 20 పరుగులు కూడా చేయలేదు. బంగ్లా బౌలర్లలో మరుఫా అక్తెర్ నాలుగు, రబేయా ఖాన్ మూడు వికెట్లు పడగొట్టారు. దీంతో వన్డేల చరిత్రలో భారత మహిళల జట్టుపై బంగ్లా తొలిసారి విజయాన్ని నమోదు చేసుకుంది. టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ముందుగా బౌలింగ్ ఎంపిక చేసుకుంది. దీంతో బంగ్లాదేశ్ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలో బంగ్లాను టీమిండియా బౌలర్లు కట్టడి చేశారు.




18 బంతులు ఆడిన బంగ్లా ఓపెనర్ షర్మిన్ అక్తెర్ (0) ఒక్క పరుగు కూడా చేయకుండానే రనౌట్ అయింది. ఆ తర్వాత కాసేపటికే ముర్షిదా ఖాతూన్ (13)ను టీమిండియా డెబ్యుటెంట్ పేసర్ అమన్‌జోత్ కౌర్ ఔట్ చేసింది. ఫర్గానా హక్ (27), కెప్టెన్ నిగల్ సుల్తానా (39) నిలకడగా ఆడారు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. వేగంగా పరుగులు చేశారు. అయితే ఫర్గానాను ఔట్ చేసి వీరి జోడీని విడదీసింది అమన్‌జోత్. ఆ తర్వాత కూడా భారత బౌలర్లు బంగ్లాను కట్టడి చేశారు. వెనువెంటనే వికెట్లు తీశారు. దీంతో 43 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది బంగ్లాదేశ్. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత జట్టు లక్ష్యాన్ని 154 పరుగులుగా అంపైర్లు సవరించారు. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు ప్రియా పూనియా (10), స్మృతి మంధాన (11) విఫలమయ్యారు. ఈ ఇద్దరినీ బంగ్లా పేసర్ మరుఫా అక్తెర్ ఔట్ చేసింది. యక్షిత భాటియా (15), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (5), జమీమా రోడ్రిగ్స్ (10) త్వరగానే ఔటయ్యారు. కాసేపు నిలకడగా ఆడిన దీప్తి శర్మను బంగ్లా బౌలర్ రబెయా ఖాన్ ఔట్ చేసింది. అమన్‌జీత్ కౌర్ (15) కూడా కాసేపు పోరాడింది. అనంతరం స్నేహ్ రానా (0) సహా మిగిలిన భారత బ్యాటర్లు పెద్దగా పరుగులు చేయకుండానే పెవిలియన్ చేరారు. దీంతో 35.5 ఓవర్లలో భారత జట్టు 113 పరుగులకే ఆలౌటైంది. భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో వన్డే జూలై 19న జరగనుంది.



## జ్యోతి డబుల్ ధమాకా

సియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి రెండో పతకంతో మెరిసింది. ఇప్పటికే మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకం చేజిక్కించుకున్న జ్యోతి.. 200 మీటర్ల పరుగులో రజతం కైవసం చేసుకుంది. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి రెండో పతకంతో మెరిసింది. ఇప్పటికే మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకం చేజిక్కించుకున్న జ్యోతి.. 200 మీటర్ల పరుగులో రజతం కైవసం చేసుకుంది. ఆదివారం పోటీల చివరి రోజు జ్యోతి 23.13 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. సింగపూర్ రన్నర్ వెరోనికా (22.70) పసిడి పతకం గెలిచింది. ఈ చాంపియన్‌సిప్‌లో 27 పతకాలు నెగ్గిన భారత్.. పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. అందులో 6 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్యాలు ఉన్నాయి. 2017లో భువనేశ్వర్ వేదికగా జరిగిన చాంపియన్‌షిప్‌లోనూ భారత్ 27 పతకాలే సాధించింది. చివరి రోజు భారత అథ్లెట్లు 13 పతకాలు నెగ్గారు. మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో స్వర్ణం నెగ్గిన పారుల్ చౌదరి.. ఆఖరి రోజు 5000 మీటర్ల పరుగులో రజతం గెలుచుకుంది.

# అల్కరాజ్ టైటిల్స్ ఆకలితో ఉన్నాడు..



నేను కూడా సేమ్ టు సేమ్. ఫైనల్లో హోరాహోరీ తప్పదు. అభిమానులకు కన్నుల పండువే' వింబుల్డన్ ఫైనల్‌కు ముందు సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ చేసిన వ్యాఖ్యలివి. 'అల్కరాజ్ టైటిల్స్ ఆకలితో ఉన్నాడు.. నేను కూడా సేమ్ టు సేమ్. ఫైనల్లో హోరాహోరీ తప్పదు. అభిమనులకు కన్నుల పండువే' వింబుల్డన్ ఫైనల్‌కు ముందు సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ చేసిన వ్యాఖ్యలివి. ఈ మాటలు అక్షర సత్యాలని ఆదివారం నిరూపితమైంది. ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచంలో అత్యుత్తమం అనదగ్గ ఇద్దరు స్టార్ ప్లేయర్లు ఆల్ ఇంగ్లండ్ కోర్ట్‌లో హోరాహోరీగా తలపడుతుంటే.. రెండు సింహాలు పోరాడినట్లు కనిపించింది. సెట్ సెట్‌కు ఆధిక్యం చేతులు మారిన పురుషుల సింగిల్స్ తుదిపోరులో చివరకు టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) 16, 76 (8/6), 61, 36, 64తో రెండో సీడ్ జొకోవిచ్‌పై విజయం సాధించాడు. వరుసగా నాలుగుసార్లు వింబుల్డన్ టైటిల్ చేజిక్కించుకున్న జొకోవిచ్ పాంచ్ పటాకా మోగించాలనుకుంటే.. ఫైనల్లో అతడికి అనూహ్య పరాజయం ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గి 36 ఏండ్ల జొకోవిచ్ అగ్రస్థానంలో ఉంటే.. నిరుడు యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గి తన ఆగమనాన్ని ఘనంగా చాటుకున్న 20 ఏండ్ల అల్కరాజ్.. రెండో గ్రాండ్‌స్లామ్ ఖాతాలో వేసుకున్నాడు. విశ్లేషకులు ఊహించినట్లే.. అల్కరాజ్, జొకోవిచ్ మధ్య పోరులో హోరాహోరీగా సాగింది. 4 గంటలా 42 నిమిషాల పాటు సాగిన వింబుల్డన్ ఫైనల్లో తొలి సెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన అల్కరాజ్.. ఆ తర్వత జొకోకు చుక్కలు చూపాడు. ప్రస్తుత తరంలో తానెందుకు స్పెషలో చాటి చెప్పాడు. తుదిపోరులో 9 ఏస్‌లు కొట్టిన అల్కరాజ్ 66 విన్నర్లు సాధిస్తే.. 2 ఏస్‌లకే పరిమితమైన జొకో 32 విన్నర్లు కొట్టాడు. చెరో 5 బ్రేక్ పాయింట్లు కాచుకోగా.. జొకోవిచ్ 40 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు. ఫలితంగా గ్రాస్ కోర్ట్‌లో వరుసగా 34 విజయాలు సాధించిన జొకోవిచ్‌కు పరాజయం తప్పలేదు. టెన్నిస్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న జొకోవిచ్‌తో తలపడుతున్నాననే బెరుకు లేకుండా.. అల్కరాజ్ తన అద్భుత విన్యాసాలతో ఆకట్టుకున్నాడు. ప్రత్యర్థిని తికమక పెడుతూ.. పదే పదే స్లో షాట్లతో నెట్ దగ్గర పాయింట్లు పట్టిన అల్కరాజ్.. తనకే అలవాటైన క్లిష్టమైన షాట్లతో పాటు గంటకు 210 కిలోమీటర్ల వేగంతో సర్వీస్ చేస్తూ అబ్బురపరిచాడు. అల్కరాజ్‌కు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్. నిరుడు యూఎస్ ఓపెన్‌తో అల్కరాజ్ గ్రాండ్‌స్లామ్ ఖాతా తెరిచాడు. విజేత: అల్కరాజ్ 25.25 కోట్లు, రన్నరప్: జొకోవిచ్ 12.62 కోట్లు

## రన్నరప్ కర్మన్

**భారత టెన్నిస్ ప్లేయర్ కర్మన్‌కౌర్ థండి.. ఐటీఎఫ్ మహిళల టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది.**

**జయభేరి, న్యూఢిల్లీ:**

భారత టెన్నిస్ ప్లేయర్ కర్మన్‌కౌర్ థండి.. ఐటీఎఫ్ మహిళల టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. కెనడాలో జరిగిన సకాటూన్ చాలెంజర్ టోర్నీ మహిళల డబుల్స్ ఫైనల్లో కర్మన్‌స్టాసీ ఫంగ్ (కెనడా) జోడీ 64, 46, 710తో రెంచెల్‌అలానా స్మిత్ జంట చేతిలో ఓడింది.





# మృతదేహాలు తారుమారు

## అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్వాకం

**జయభేరి, అనకాపల్లి :**

**అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ట ఈ ఘటన. రెండు వేరువేరు మృతదేహాలు తారుమారు చేశారు సిబ్బంది. ఒకరి మృతదేహాన్ని మరొకరి బంధువులకు అప్పగిం చేశారు. ఓ మృతదేహం తీసుకెళ్లిన ఓ బాధిత కుటుంబం.. అంత్యక్రియలు కూడా నిర్వహించింది. మరో డెడ్ బాడీ కేసులో పోలీసులు వచ్చి చూసేసరికి ఆ డెడ్ బాడీ కనిపించకుండా పోయింది. దీంతో మృతదేహాలు తారుమారైనట్టు వెలుగులోకి వచ్చింది.**

అనకాపల్లి జిల్లా మునగపాక మండలం తోటాడకు చెందిన 55 ఏళ్ల శ్రీను. గత కొన్నేళ్లుగా కుటుంబం కి దూరంగా ఉంటున్నాడు. ఎక్కడున్నాడో ఏమయ్యాడో తెలియక కుటుంబం కూడా. శ్రీనుకు దూరంగా నే ఉంది. అయితే ఈనెల 10వ తేదీన అనకాపల్లిలో తీవ్ర అనారోగ్యానికి గురైన శ్రీనును స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. గుర్తుతెలియని వ్యక్తిగా 108 లో ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12న మరణించాడు. బంధువులు ఎవరో తెలియక మార్చు రీలో మృతదేహాన్ని భద్రపరిచారు ఆసుపత్రి సిబ్బంది. మరోవైపు సబ్బవరంలో ఈ నెల 11న అసకప ల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో వీఆర్వో సమాచారంతో పోలీసులు స్వాధీనం చేసుకుని.. ఆ మృతదేహాన్ని పోస్ట్మార్టం కోసం మార్చురీ కి తీసుకెళ్లారు. ఇక అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని శ్రీను గా తెలుసుని వాళ్ల బంధువులు ఆసుపత్రి వర్గాలను సంప్రదించారు. అయితే ఆ మృతదేహం మార్చురీలో ఉందని చెప్పి.. గుర్తుపట్టేందుకు పంపారు. శ్రీను ఇంటి నుంచి వెళ్ళిపోయి చాలా ఏళ్లు గడవడంతో ఓ మృతదేహాన్ని చూసి తమదేనని మార్చురీ సిబ్బందికి చెప్పారు. దీంతో మృతదేహాన్ని అప్పగించేశారు. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుర్తుతెలియని వ్యక్తి పంచనామా కోసం సబ్బవరం పోలీసులు.. మార్చురీకి వెళ్లారు. దీంతో లోపల ఎంత వెతికినా మృతదేహం కనిపించలేదు. చివరికి మార్చురీ సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో మార్చురీ సిబ్బంది.. ఇదేనండి ఆ డెడ్ బాడీ అని చూపారు. అది ఆ కేస్ కాదయ్యా.. అని చెప్పేసరికి అందరూ నోరెళ్ల పెట్టారు. మరి యాక్సిడెంట్ కేసులో ఉన్న డెడ్ బాడీ ఎక్కడ అని వెరిఫై చేసేసరికి.. శ్రీను కు చెందిన బంధువులకు అప్పగించిందేనని గుర్తించారు. ఆరాతీసేసరికి.. అప్పటికే మృతదేహాన్ని ఖననం చేసినట్టు తెలుసుకున్న పోలీసులకు మరో షాక్ తగిలినట్టుంది.అనంతరం విషయాన్ని ఆసుపత్రి సూపరిండెంట్ దృష్టికి తీసుకెళ్లారు పోలీసులు. అయితే జరిగిన పొరపాటును ఆలస్యంగా గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది.. తలలు పట్టుకున్నారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు ఆసుపత్రి సూపర్డెంట్ శ్రవణ్ కుమార్. ఇది తెలుసుకున్న శ్రీను బంధువులు కూడా అవాక్కయ్యారు. మృతదేహాలు తారుమారు కావడంతో ఇక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు పోలీసులు ఆసుపత్రి అధికారులు. ప్రొసీజర్ ప్రకారం.. మళ్లీ మృతదేహాలను అప్పగించే ఏర్పాటు చేస్తున్నారు. అయితే శివ మృతదేహం అనుకొని అతని కుటుంబ సభ్యులు ఇప్పటికే ఖననం చేసిన.. యాక్సిడెంట్ కేసు డెడ్ బాడీని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు.వాస్తవానికి ఏవైనా మృతదేహాలు మార్చురీ వరకు తీసుకొస్తే.. వాటిని జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది. మృతదేహాలకు ప్రత్యేకంగా ట్యాగ్ కూడా వేస్తారు. కానీ ఈ రెండు మృతదేహాలకు కూడా కనీసం గుర్తింపు ఆనవాళ్లు కూడా పెట్టలేదు. ఎంతలా అంటే.. బంధువులు వచ్చి ఆ మృతదేహం తమదే అని చెప్పేసరికి చెక్ చేసుకోకుండా.. ముందు వెనుక ఆలోచించకుండా సంతకాలు తీసుకుని ఇచ్చేశారు. బంధువులు గుర్తుపట్టినప్పటికీ.. ఆసుపత్రి సిబ్బంది గాని పోలీసులు గాని ఒకటికి రెండు మూడు సార్లు చెక్ చేసుకుని.. నిర్ధారించుకున్న తర్వాతే డెడ్ బాడీలను అప్పగించాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. మార్చురీ పర్యవేక్షక అధికారి కూడా కనీసం అటువైపు కన్నెత్తైనా చూడలేదు. మరి ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యం ఎంత అనేదానిపై విచారణ జరగాల్సి ఉంది.

# పవన్ పై మంత్రి అమర్ సెటైర్లు

**జయభేరి, విశాఖపట్నం :**

రెండో దశ వారాహి విజయ యాత్రలో పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు ఏపీలో సంచలనం సృష్టిస్తున్నాయి.యాత్రలో భాగంగా మొదటి బహిరంగ సభ ఏలూరులో వాలంటీర్లను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు.మహిళా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వ్యాఖ్యలు చేయడం పెను దుమారం రేపింది.రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలకు తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.పరిస్థితి ఇలా ఉంటే వాలంటీర్ల పై పవన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి గుడివాడ అమర్నాథ్ ఖండించారు.దమ్ముంటే వచ్చే ఎన్నికలలో జనసేన మేనిఫెస్టోలో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.ప్రజలకు బహిరంగంగా వాలంటీర్ల రద్దు గురించి చెప్పగలరా అని నిలదీశారు.కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వాలంటీర్లు సేవ చేశారని,పెళ్లిళ్లు చేసుకోవడంలో పవన్ కళ్యాణ్ విప్లవం సృష్టించాడని.ఈ విప్లవాన్ని ప్రజలపై రుద్దుతున్నాడు అంటూ మంత్రి అమర్నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

జయభేరి సినిమా

## జేడీ చక్రవర్తి ఈజ్ బ్యాక్



ముప్పై నాలుగేళ్ల క్రితం రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన శివ సినిమాలో ఓ చిన్న రోల్‌లో మెరిసాడు జేడీ చక్రవర్తి. అదే రామ్‌గోపాల్ వర్మ నాలుగేళ్ల తర్వాత జేడీ చక్రవర్తిని హీరోగా పెట్టి మనీ అనే కామెడీ థ్రిల్లర్ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా అప్పట్లో సృష్టించిన రికార్డులు అంతా ఇంతా కాదు. ఈ సినిమాతో జేడీ చక్రవర్తి ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు. ఆ తర్వాత గులాబీ, దెయ్యం, బాంబే ప్రియుడు వంటి హిట్లతో స్టార్ ఇమేజ్ దక్కించుకున్నాడు. అదే టైమ్‌లో సత్యతో హిందీలోకి ఎంట్రీ ఇచ్చి.. అక్కడ కూడా సెన్సేషనల్ హిట్టు అందుకున్నాడు. ఆ తర్వాత ఇటు దక్షిణాన, అటు ఉత్తరాదిన బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసుకుంటూ పోయాడు. హీరోగానే కాకుండా విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా జేడీ పలు సినిమాలు చేశాడు. అయితే గతకొంత కాలంగా జేడీ చక్రవర్తి ఎక్కువగా సినిమాల్లో కనిపించడం లేదు. మరీ ముఖ్యంగా తెలుగులో నాలుగేళ్లుగా ఒక్క సినిమా కూడా చేయలేదు. కాగా ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. దయా టైటిల్‌తో రూపొందిన ఈ వెబ్ సిరీస్ ఆగస్టు 4నుంచి హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. పవన్ సాధినేని దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ తాజాగా రిలీజైంది.



## వైష్ణవి చైతన్య తొలి పారితోషికం ఎంతో తెలుసా?

ప్రస్తుతం టాలీవుడ్ యూత్ జపిస్తున్న మంత్రం వైష్ణవి చైతన్య. రెండు రోజుల కిందట రిలీజైన బేబి సినిమాలో తన పర్‌ఫార్మెన్స్‌తో అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. సినిమా చూసిన ప్రతీ ఒక్కరు వైష్ణవి క్యారెక్టర్‌ను బండ బూతులు తిడుతున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ యూత్ జపిస్తున్న మంత్రం వైష్ణవి చైతన్య. రెండు రోజుల కిందట రిలీజైన బేబి సినిమాలో తన పర్‌ఫార్మెన్స్‌తో అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. సినిమా చూసిన ప్రతీ ఒక్కరు వైష్ణవి క్యారెక్టర్‌ను బండ బూతులు తిడుతున్నారు. అంటే నెగెటీవ్ క్యారెక్టర్‌లో ఏ లెవల్ పర్‌ఫార్మెన్స్ ఇచ్చిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. డెబ్యూ సినిమాలోనే అన్నన్ని వేరేయేషన్లు చూపించడం మాములు విషయం కాదు. ఒక తెలుగు హీరోయిన్‌కు తొలి సినిమాతోనే ఈ రేంజ్ గుర్తింపు రావడం ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడలేదు. ఖచ్చితంగా ది బెస్ట్ డెబ్యూ పర్‌ఫార్మెన్స్‌లలో వైష్ణవి చైతన్య నటన ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహమే లేదు. వైష్ణవి చైతన్య గురించి వెండితెరపై సినిమాలు చూసేవారికి పెద్దగా పరిచయం లేదు కానీ.. టిక్ టాక్ వీడియోలు, యూట్యూబ్ షార్ట్ ఫిలింస్ చూసే వారికి ఈమె సుపరిచితురాలే. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ వెబ్ సిరీస్‌తో మంచి పాపులారిటీ తెచ్చుకుంది. అల వైకుంఠపురం, టక్ జగదీష్, వరుడు కావలెను వంటి పలు సినిమాల్లో ఈ అమ్మడు కీలకపాత్రలు చేసింది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈమె తన తొలి సంపాదన గురించి అభిమానులతో పంచుకుని అందరిని షాక్‌కు గురిచేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైష్ణవి తన తొలి పారితోషికం రూ.700 అని చెప్పింది. ఒక ఈవెంట్ కోసం డ్యాన్స్ చేసే అవకాశం రాగా.. రోజంతా చాలా కష్టపడి డ్యాన్స్ చేస్తే ఏడొందల రూపాయలు ఇచ్చారని వైష్ణవి చెప్పింది. కానీ ఇప్పుడు ఎంత సంపాదించినా ఆ ఏడొందలే తనకు చాలా స్పెషల్ అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీకు అవకాశాలు క్యూ కడతున్నాయని సమాచారం. బేబి సినిమాలో ఆమె పర్‌ఫార్మెన్స్ చూసి చాలా మంది దర్శక, నిర్మాతలు అమెను అప్రోచ్ అవుతున్నారని ఇన్‌సైడ్ టాక్.




## పవన్ ఫ్యాన్స్‌కు ఇకపై పండగే..!

పవన్ కళ్యాణ్ లైనప్‌లో హరి హర వీరమల్లు అనే సినిమా ఒకటుందని ప్రేక్షకులు దాదాపుగా మర్చిపోయే స్థితికి వచ్చారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెండేళ్ల క్రితమే పట్టాలెక్కింది. పవన్ కళ్యాణ్ లైనప్‌లో హరి హర వీరమల్లు అనే సినిమా ఒకటుందని ప్రేక్షకులు దాదాపుగా మర్చిపోయే స్థితికి వచ్చారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెండేళ్ల క్రితమే పట్టాలెక్కింది. కానీ ప్యాసింజర్ ట్రైన్‌లా నెమ్మదిగా ప్రయాణం సాగిస్తుంది. ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లు వచ్చినప్పుడు ప్యాసింజర్ ట్రైన్‌కు ఏ విధంగా బ్రేకులు పడతాయో హరిహర వీరమల్లు పరిస్థితి కూడా దాదాపుగా అంతే. ఐదారు నెలల కింద ప్రకటించిన సినిమాలు సైతం షూటింగ్ చివరి దశలోకి వచ్చేస్తున్నాయి. కానీ హరి హర వీరమల్లు మాత్రం ఓ కొలిక్కి రాలేకపోతుంది. ఈ సినిమా పెండింగ్ వర్క్ ఇంకా చాలానే ఉందని ఇన్‌సైడ్. పవన్ ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉండటంతో ఈ సినిమాను పక్కన పెట్టాడు. పైగా ఐదారు నెలల్లో కంప్లీట్ అవుతుందంటే డేట్స్ అడ్జెస్ట్ చేయొచ్చు. కానీ ఈ సినిమా పీరియాడిక్ నేపథ్యంలో భారీ బడ్జెట్ తో రూపుదిద్దుకుంటుంది. అందుకే పవన్ ఈ సినిమాకు డేట్స్ కేటాయించలేకపోతున్నాడట. దాంతో పవన్ తక్కువ రోజుల్లో పూర్తయ్యే బ్రో, ఓజీ సినిమాలను కంప్లీట్ చేసే పనిలో పడ్డాడు. ఇక ఇదిలా ఉండగా గత కొన్ని రోజులుగా హరి హర వీరమల్లు సినిమా క్యాన్సెల్ అయిందని, క్రిష్ వేరే హీరోతో కొత్త సినిమా ప్లాన్ చేస్తున్నాడని తెగ వార్తలు పుట్టుకొచ్చాయి. కాగా తాజాగా ఈ రూమర్స్‌కు నిర్మాత ఏఎమ్ రత్నం బ్రేకులు వేశాడు. షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగితే హరి హర వీరమల్లు సినిమాను పూర్తి చేస్తామని, ఒకవేళ అలా జరగకపోతే వచ్చే ఏడాది సినిమాను తిరిగి ప్రారంభిస్తామని ఏఎమ్ రత్నం చెప్పాడు. అంతేకాకుండా పవన్ కళ్యాణ్‌కు ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను, కామన్ మ్యాన్ కోసం ఎదైనా చేయలనే ఆయన తపనను మేము కూడా అర్థం చేసుకోగలము అని ఆయన చెప్పుకొచ్చాడు. ఈ స్టేట్ మెంట్ తో హరి హర వీరమల్లు సినిమా ఖచ్చితంగా ఉంటుందని క్లారిటీ వచ్చేసింది. ఇక తాజాగా ఇన్‌స్టాలో పవన్ పోస్ట్ చేసిన వీడియోలో హరిహర వీరమల్లుకు సంబంధించిన పిక్‌ను కూడా యాడ్ చేశాడు. ఇందులో మరో విశేషం ఏంటంటే.. చిత్రబృందం నుంచి అఫీషియల్‌గా రిలీజ్ కానీ.. నిధి అగర్వాల్‌తో ఉన్న పిక్‌ను పవన్ పంచుకున్నాడు.



## ఉప్పెనలా ఫాలోయింగ్.. కృతిశెట్టికి నెటిజన్లు ఫిదా

ఉప్పెన సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మాయ చేసింది ముంబై బ్యూటీ కృతిశెట్టి. ఈ చిత్రంలో బేబమ్మ పాత్రలో క్యూట్ క్యూట్‌గా మెరిసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. సినిమా సినిమాకు పర్‌ఫార్మెన్స్ డోస్ పెంచుకుంటూ.. అదే రేంజ్‌లో ఫాలోవర్లను కూడా సంపాదించుకుంది. సోషల్ మీడియాలో ఈ భామ తక్కువ టైంలోనే అరుదైన మైల్‌స్టోన్ చేరుకుంది. కృతిశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య 6 మిలియన్లకు చేరుకుంది. తనపై అమితమైన చూపిస్తూ.. తన ప్రయాణానికి మద్దతు అందిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలియజేసింది కృతిశెట్టి. 2021లో ఉప్పెన సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన కృతిశెట్టి.. కేవలం రెండేళ్ల టైంలోనే 6 మిలియన్ల ఫాలోవర్లను సంపాదించుకుని టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ ఏడాది వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిన కస్టడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది కృతిశెట్టి. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. కృతిశెట్టి ప్రస్తుతం తమిళంలో జయం రవితో కలిసి సినిమాలో నటిస్తోంది. మలయాళంలో మరో సినిమా చేస్తోంది. ఈ రెండు సినిమాలతో ఓ వైపు మాలీవుడ్, మరోవైపు కోలీవుడ్‌లో కూడా పాగా వేసేందుకు రెడీ అయినట్టు చెప్పకనే చెబుతోంది.



## నిత్యామీనన్ ఇంట తీవ్ర విషాదం..

హీరోయిన్ నిత్యామీనన్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. తనకెంతో ఇష్టమైన వాళ్ల అమ్మమ్మ తుది శ్వాస విడిచింది. ఈ విషాద ఘటనను నిత్యామీనన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఎమోషనల్ అయింది. తన అమ్మమ్మ తాతయ్యలతో కలిసి ఉన్న ఫొటోను నిత్యామీనన్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. 'ఒక శకం ముగిసింది. గుడ్ బై అమ్మమ్మ అండ్ మై చెర్రీ మ్యాన్. మరో లోకంలో కలుద్దాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ నోట్ రాసుకొచ్చింది. దీనిపై పలువురు అభిమానులు నిత్యామీనన్‌ను ధైర్యంగా ఉండమని కామెంట్స్ చేస్తున్నారు. పుష్కర కాలం క్రితం వచ్చిన అలా మొదలైంది సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగపెట్టింది ఈ మలయాళ బ్యూటీ. తొలి సినిమాతోనే తిరుగులేని పాపులారిటీ తెచ్చుకుంది. ఆ తర్వాత ఇష్క్, గుండెజారి గల్లంతయ్యిందే, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు ఇలా బ్యాక్ టు బ్యాక్ హిట్లతో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా పేరు సంపాదించుకుంది. ఆ మధ్య కాస్త డల్ అయినట్లు కనిపించినా.. భీమ్లానాయక్, తిరు సినిమాలతో మళ్లీ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం నిత్యామీనన్ చేతిలో రెండు, మూడు సినిమాలున్నాయి.

## జపాన్‌లో రికార్డులు కొల్లగొడుతున్న రంగస్థలం.. ఆ దేశంలో అరుదైన రికార్డు !

ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్‌గా మారిపోయాడు టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్. ఈ సినిమాతో వరల్డ్‌వైడ్‌గా సూపర్ పాపులారిటీ సంపాదించుకున్నాడు. తాజాగా మరోసారి గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు రాంచరణ్. ఈ టాలెంటెడ్ యాక్టర్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో నటించిన మూవీ రంగస్థలం. 2018 మార్చి 30న ప్రేక్షకుల ముందుకొచ్చిన రంగస్థలం రాంచరణ్‌ను నటుడిగా మరో రేంజ్‌కు తీసుకెళ్లిందనడంలో ఎలాంటి సందేహం లేదు. రంగస్థలం జపాన్ లో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రం జపనీయులను కూడా ఇంప్రెస్ చేస్తోంది. రాంచరణ్ హర్ట్ టచింగ్ యాక్టింగ్‌కు జపాన్ మూవీ లవర్స్ ఫిదా అవుతున్నారు. ఈ చిత్రం జపాన్‌లోనూ తన రేంజ్ ఏంటో చూపిస్తోంది. ట్రేడ్ అనలిస్ట్ రమేశ్ బాలా అందించిన సమాచారం ప్రకారం రంగస్థలం జపాన్‌లోని వివిధ ప్రాంతాల్లో 70 థియేటర్లలో విడుదలైంది. తొలి రోజు 2.5 మిలియన్ యెన్ (రూ.14,79,460) వసూళ్లు చేసింది. దీంతో జపాన్‌లో తొలి రోజు అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ సినిమాగా రంగస్థలం అరుదైన రికార్డును ఖాతాలో వేసుకుంది. రంగస్థలం తెలుగు రాష్ట్రాలతోపాటు వరల్డ్ వైడ్‌గా మొత్తం రూ.215 కోట్లకుపైగా గ్రాస్‌ను రాబట్టి అప్పట్లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఇప్పుడు ఖండాంతరాల్లో తన సత్తా చాటుతూ ఇండియన్ సినిమా గొప్పదనాన్ని మరోసారి చాటి చెబుతోంది. ఇప్పటికే జపాన్‌లోని ఓ థియేటర్‌లో జపనీస్ భాషలో డిజైన్ చేసిన రంగస్థలం పోస్టర్ నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. రంగస్థలం అనే గ్రామం చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీలో చెన్నై సుందరి సమంత ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. జగపతిబాబు విలన్‌గా నటించగా.. ఆది పినిశెట్టి, నరేశ్ కీలక పాత్రల్లో నటించారు. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. అనసూయ భరద్వాజ్ మరో కీలక పాత్ర పోషించింది.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com